

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 27 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 120 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA














## పింకు కార్ల ర్యాలీ

హైదరాబాద్, ఏప్రిల్ 26, మనం ప్రతినిధి : వరంగల్ ఎల్కతుర్తిలో నేడు నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభను నిర్వహించి, ఈ సభ ద్వారా మాజీ సీఎం, గులాబీ అధినేత కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసింద్రు. 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సందర్భంగా.. ఈ సెలబ్రేషన్స్‌కు భారీగా, హైప్ క్రియేట్ చేసేందుకు.. ఎడ్ల బండ్లు, అంబాసిడర్స్‌తో కార్లతో భారీ ఎత్తున ర్యాలీగా సభకు రావాలని ముఖ్య నేతలంతా జోరుగా ప్రచారం చేసింద్రు?.. ఇక తమ పార్టీ గుర్తుగా ఉన్న అంబాసిడర్స్.. 100 కార్లతో ర్యాలీగా బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వెళ్లాలని అంబాసిడర్ కార్లను కూడా సిద్ధం చేసుకున్నరు. రవి యాదవ్ ఓ యువనేత 100 అంబాసిడర్ కార్లను సేకరించి, ఆ కార్లకు రిపేర్లు చేయించి, వాటన్నిటికీ గులాబీ కలర్, కేసీఆర్ స్టిక్కర్లు వెయించి మరి ర్యాలీగా వరంగల్ బహిరంగ సభకు వెళ్లాలని కార్లను సిద్ధం చేసింద్రు. అయితే, 100 అంబాసిడర్ గులాబీ రంగు కార్లు రోడ్డుపై వెళ్తుంటే అది ప్రజలలో గులాబీ పార్టీకి ఉన్న ఇమేజ్‌ని తెలియజేస్తుందని.. బీఆర్ఎస్ సింబల్ ప్రజల మనసులో నాటుకుపోయేలా కార్ల ర్యాలీ తీయనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సింబల్.. అంబాసిడర్ కారును ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు తీసుకు వెళ్లడమే కాకుండా, కారు సింబల్ ప్రజల మనసులో నాటుకుపోయేలా ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలకు అంబాసిడర్ కార్ల ర్యాలీని నిర్వహించనున్నామని సదరు యువనేత చెబుతున్నారు.



















## కిషన్ రావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి ఏప్రిల్ 26 (మనం న్యూస్): ఆర్కే పురం డివిజన్ జనప్రియ కాలనీకి చెందిన కిషన్ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి , మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి శనివారము ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గౌడుగు శ్రీనివాస్, సాజిద్, శ్యాం గుప్తా , కొండ్ర శ్రీనివాస్, భూపాల్ రెడ్డి,పటేల్ సునీత రెడ్డి, మహేందర్ రెడ్డి, ఊర్మిళ రెడ్డి, జగన్, జాహీద్ ,మురళీధర్ రెడ్డి లు ఉన్నారు.

# జడ్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్ ప్రారంభం




రంగారెడ్డి, ఏప్రిల్ 26 (మనం న్యూస్): ఉన్నత విద్య,గ్లోబల్ కేర్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల కోసం అమెరికాలోని జడ్సన్ యూనివర్సిటీ 2025 గాను స్పాట్ అడ్మిషన్స్ అవకాశం కల్పిస్తుందని జడ్సన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా. నిక్కి ఫెనర్ను తెలిపారు. శుక్రవారం చైతన్యపురి లోని కెరీర్ వింగ్స్ కన్సల్టెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంకు ఆమె హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ లో లీడింగ్ లో ఉన్న కెరీర్ ఎడ్యు గ్రూప్ ఈ ఏడాది యునైటెడ్ స్టేట్స్ లో చదువుకోవాలని విద్యార్థుల కోసం అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అమెరికాకు చెందిన జడ్సన్ యూనివర్సిటీతో అనుసంధానమై స్పాట్ అడ్మిషన్స్ ఈవెంట్ ను ఏప్రిల్ 26న హిమాయత్ నగర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టెమ్ ఫోకస్డ్ మాస్టర్స్, డాక్టోరియల్ ప్రోగ్రామ్లో స్పాట్ అడ్మిషన్స్ పొందవచ్చు అన్నారు. అప్లికేషన్ ఫీజు లేకుండా, ఐ20 డిపాజిట్స్ కూడా ఉండవన్నారు. 24 గంటల్లో యాక్సెప్టెన్స్, మూడు రోజుల్లో ఐ20 లభిస్తుంది అన్నారు. సీసీ ప్రెసిడెంట్ స్కాలర్షిప్ తో సహా 9200 స్కాలర్షిప్ లభిస్తుంది అన్నారు. ఎలాంటి సందేహాలున్న నేరుగా జడ్సర్ యూనివర్సిటీ అధికారుల్ని కలవచ్చు అన్నారు. జడ్సర్ నుంచి గ్రాడ్యుయేట్ అయిన వాళ్లకు డైరెక్ట్ క్యాంపస్ ప్లేస్మెంట్ అవకాశం కల్పిస్తుంది అన్నారు. స్టెమ్ ప్రోగ్రామ్స్ లో ఎమ్మెస్ కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఇన్ఫర్మేటిక్స్, డాక్టరేట్ ఇన్ కంప్యూటర్ సైన్స్ లు ఉంటాయి అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9052000710, 7995866681 నెంబర్లలో సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెరీర్ ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్ ఇర్ఫాన్ అహ్మద్,ఇంటర్నేషనల్ యూఎస్ఏ స్టూడెంట్ కౌన్సిలర్ నవ్య, మార్కెటింగ్ మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలి

- అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, ఏప్రిల్ 26 (మనం బ్యూరో): కరీంనగర్ లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ ను రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఉజ్వల పార్కు సమీపంలోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ లో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. స్కూల్ చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. స్కూల్లో ఆవరణనలో క్రీడాకారులను ఆకట్టుకునేలా మొక్కలు నాటాలని, ఫౌంటెన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్విమ్మింగ్ పూల్ దగ్గర మొక్కలు నాటించాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూలు క్రీడాకారులకు తలమానికంగా నిలుస్తుందని, అందుకు తగ్గట్లు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలని పమేలా సత్పతి సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తారని, ఇందుకు వారిని ఆ రంగంలో ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం పై ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా స్పోర్ట్స్ స్కూల్ ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ గౌడ్, పిఆర్‌డిఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# భవిత సెంటర్లను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ప్రత్యేకావసరాలున్న పిల్లలకు ఏ ఇబ్బందులు రావద్దు
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, ఏప్రిల్ 26 (మనం బ్యూరో): ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఆధునీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ముకరంపురంలోని భవిత సెంటర్ ను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని భవిత సెంటర్ ను ఒక మోడల్ గా గ్రాండ్ లుక్ ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా భవిత సెంటర్లు దోహదపడాలని, ఆ విధంగా వాటిని తయారు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిత సెంటర్లలో వాల్ పెయింటింగ్స్, ప్లే వే మెటీరియల్ ఏర్పాటు చేయడంతో పాటు చదువుకోవడానికి, క్రీడలకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని ఆమె సూచించారు. వారికి చదువుపై ఆసక్తి కలిగించేలా భవిత సెంటర్లను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు అన్ని విధాలా వారికి అధికారులు తోడు నీడగా ఉండాలని పమేలా తెలిపారు. పిల్లలను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని, అందుకు భవిత సెంటర్ల సిబ్బంది నిరంతరం పాటుపడాలని సొంత బిడ్డల్లాగా వారిని చూసుకోవాలని సూచించారు. జిల్లాలోని 16 భవిత సెంటర్లను ఆధునీకరించే పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయా సెంటర్ల అభివృద్ధి కోసం తాము నిరంతరం ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిసి డివో కృపారాణి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ విడుదల

చేవెళ్ల, ఏప్రిల్ 26(మనం న్యూస్ ): మే ' డే' ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.... 8 గంటల పని విధానం కోసం ప్రాణాలను త్యాగం చేసిన కార్మికులను స్మరించుకుంటూ, కార్మికుల హక్కులకు నాంది పలికిన మేడేను విజయవంతం చేయాలని, మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం కార్మికులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. 8 గంటల పని విధానాన్ని నేటి పాలకులు 12 గంటలకు పొడగిస్తున్నారని పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా అనేక జీవోలు తీసుకు వస్తున్నారని దీనిని కార్మికులు ఐక్యమత్యంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు . కనీస వేతనం 26,000 అమలు కోసం మరియు



ఇతర సదుపాయాల కోసం పోరాటం చేయాలని అన్నారు . చేవెళ్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని మే డే ను కార్మికులు పండుగల జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## భారత్ సమ్మిట్ లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు




నిజామాబాద్, ఏప్రిల్ 26(మనంప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు ఎంపీ రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా జరుగుతున్న భారత్ సమ్మిట్ లో మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్,రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర విత్తనఅభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ వనస్థలి క్రాంతి ఏకగ్రీవ ఎన్నిక




రంగారెడ్డి, ఏప్రిల్ 26 (మనం న్యూస్) లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ,వనస్థలి క్రాంతి సర్వసభ్య సమావేశం, మధుర రెసిడెన్సీ,వనస్థలిపురంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో లయనిస్టిక్ ఇయర్ 2025-26 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. లయన్ సాధు కృష్ణ కిషోర్ అధ్యక్షుడు,లయన్ గుర్రం శ్రీనివాస రెడ్డి కార్యదర్శి,లయన్ డా.మారంరాజు సంధ్యారాణి కోశాధికారి,లయన్ సంతాపూర్ రామచంద్ర రావు,మల్లేశం అన్నం ఉపాధ్యక్షులుగా,లయన్స్ వి వెంకటస్వామి, మల్లేశం అన్నం,ఎల్ సి ఎఫ్ కోఆర్డినేటర్ గా నందిరాజు లక్ష్మీ నారాయణ,సర్వీస్ ఛైర్పర్సన్ లయన్ రంగినేని వెంకటేశ్వర్లు, మెంబర్షిప్ ఛైర్పర్సన్ సి.భూపాల్ రెడ్డి,మార్కెటింగ్ ఛైర్పర్సన్ గా స్వరాజ్ కుమార్ భట్టు,క్లబ్ అడ్మినిస్ట్రేటర్ గా లయన్ మార్తి వాసుదేవ రావు, ఐదుగురు సభ్యులు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు.

ఈ సమావేశంలో లయన్ సాధు శ్యాం ప్రసాద్, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్, లయన్ డా మారంరాజు, రామచంద్ర రావు, జడ్. సి,నాగవరం మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## రాగల 3 రోజులలో అధిక ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్): రాగల 3 రోజులలో అధిక ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో రాగల మూడు రోజుల వరకు (ఏప్రిల్ 27 నుంచి ఏప్రిల్ 30) వాతావరణ విశ్లేషణ వాతావరణ శాఖ అందించిందని, ఏప్రిల్ 27న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి ఏప్రిల్ 30 వరకు పెద్దపల్లి జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుండి మూడు డిగ్రీలు అధికంగా ఉండే అవకాశం ఉందని, వాతావరణ శాఖ అంచనా ప్రకారం 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నవోదయ అవకాశాలు ఉన్నాయని, అదే సమయంలో వడ గాల్పులు వీచే అవకాశం , రాత్రిపూట వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని , ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వరంగల్ లో జరిగే రజథోత్సవ సభ ను విజయవంతం చేయాలి

భీంగల్ ,ఏప్రిల్ 26 (మనం న్యూస్): బీఆర్ఎస్ పార్టీ రథోత్సవ 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్లో నిర్వహిస్తున్న రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆదేశానుసారం. భీంగల్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. భీంగల్ మండలం మరియు పట్టణం నుండి 14 బస్సుల్లో 700 మంది పార్టీ నాయకులు కార్యకర్తలను తరలించాలని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఆదివారం ఉదయం 9:00 గంటలలోపు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రతి కార్యకర్త బస్సుల్లోనే బహిరంగ సభకు తరలిరావాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనకంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జెడ్పిటిసి చౌటుపల్లి రవి, మాజీ జడ్పి కోఆప్షన్ ఎంఏ మోయిజ్, సొసైటీ చైర్మన్ శివసారి నర్సయ్య ,శర్మ నాయక్, తూకాజీ నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు బొదిరె నరసయ్య, మూత లింబాద్రి ,మల్లెల ప్రసాద్, సతీష్ గౌడ్, లింగం నాయక్, ఎంఏ రజాక్, పర్సన్ నవీన్, తుమ్మ ముత్తెన్న మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అష్టలక్ష్మీ దేవాలయం 29వ(ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవములు



రంగారెడ్డి ఏప్రిల్ 26 (మనం న్యూస్) మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో 29వ(ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవముల ను ఈ నెల28 సోమవారం నుండి 4 వ తేది ఆదివారం వరకు కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా వాహనోత్సవములు, సంకీర్తనలు, కోలాటాలు, నృత్యాలతో ఎంతో వైభవముగా నిర్వహించబడునని దేవాలయ చైర్మెన్ సోమ సురేష్ తెలిపారు. 28 సోమవారం రోజున తిరుచ్చిపల్లకి సేవ, 29 మంగళవారం రోజున శ్రీ లక్ష్మీనారాయణ ఇష్టి హవనము, హంసవాహనసేవ, 30 బుధవారం రోజున నృసింహ ఇష్టి, సూర్య ప్రభ వాహనసేవ, గజవాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, ఎదురుకోలు ఉత్సవం, 1 గురువారం రోజున హయగ్రీవ ఇష్టి, హనుమత్ వాహనసేవ, గరుడవాహన సేవ,శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణమహోత్సవం, దీపోత్సవము, అశ్వవాహన సేవ, 02 శుక్రవారం రోజున వరాహ ఇష్టి, సింహ వాహన, రథోత్సవము. 03 శనివారం రోజున సుదర్శన ఇష్టి, కల్పవృక్ష వాహన సేవ, మహా పూర్ణాహుతి.04 ఆదివారం రోజున అష్టోత్తర కలశాభిషేకము, చిన్న రథోత్సవము తదితర కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు బాల్కొండ నియోజకవర్గం సర్వం సిద్ధం..

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



బాల్కొండ, ఏప్రిల్ 26( మనం న్యూస్): రేపటి వరంగల్ సభకు వేలాదిగా తరలిరానున్న బి ఆర్ ఎస్ శ్రేణులు,అభిమానులు, ప్రజలు సిద్ధమయ్యారని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలం కోడిచెర్ల గ్రామంలో కేసీఆర్, కేటీఆర్,కవితమ్మ ప్రశాంత్ రెడ్డి ఫొటోలతో జెండా గద్దె ఏర్పాటు చేసిన గ్రామ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వారి అభిమానాన్ని చాటుకున్నారనీ ఆయన అన్నారు.

# ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయింపు

- ఏటా భూ రికార్డుల ఆధునీకరణ
- రైతులకు ఉచిత న్యాయ సేవలు
- భూభారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ వెల్లడి




నిజామాబాద్, ఏప్రిల్ 26(మనంన్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్.ఓ.ఆర్ - 2025) నూతన చట్టం ద్వారా భూ వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూ కమతాలకు భూదార్ నెంబర్లను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. నిర్దిష్ట గడువులోపు భూ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్, నందిపేట, ఆర్మూర్ మండల కేంద్రాలలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా తెలియజేశారు. ఇదివరకు అమలులో ఉన్న ధరణితో పోలిస్తే, రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని అన్నారు. భూధార్ నెంబర్ కేటాయిపు వల్ల భూ ఆక్రమణలకు, అనవసర వివాదాలకు అవకాశం ఉండదని, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందని అన్నారు. భూముల రికార్డులలోని పొరపాట్లను పరిష్కరించేందుకు ధరణిలో అవకాశం ఉండేది కాదని, ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా అలాంటి సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పిస్తూ నూతన చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మే, జూన్ మాసాలలో గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో కూడా దరఖాస్తుచేసుకోవచ్చని తెలిపారు. ఆ అర్జీలను 60 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తారని సూచించారు. ఒకవేళ రైతులు సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం భూభారతి చట్టంలో రెండంచెలఅప్పీలు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఏవైనా భూసమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తులను పరిష్కరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు.ఈ సదస్సులలో నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, ఆర్మూర్ ఆర్డీఓ రాజా గౌడ్, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 27 ఏప్రిల్ 2025 ‖ సంపుటి: 9 ‖ సంచిక: 120 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## టెర్రర్ డెన్ మటాష్

ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం ● పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం



5

## ఏం జరిగినా ఎదుర్కొంటాం

పహల్గాం ఉగ్రదాడిపై పాక్ ప్రధాని స్పందన

శాంతికే మా ప్రాధాన్యతంటూ ప్రవచనం

దర్యాప్తులో పాల్గొంటామన్న షెహబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్, ఏప్రిల్ 26: జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు ...మిగతా 5లో

## సయోధ్య కుదర్చడానికి మేం సిద్ధం.. ఇరాన్

ఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇరాన్ ...మిగతా 5లో

## పరిష్కారం భారత్–పాక్ చేతుల్లోనే

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



న్యూయార్క్,ఏప్రిల్ 26: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా అధ్యక్షుడు ...మిగతా 5లో

# పాతతరం అంతరించింది.. యువత రాజకీయాల్లోకి రావాలె



## కొత్త ఆలోచనలతో దేశం అభివృద్ధి సాధిస్తుంది

చట్టసభల్లో విపక్షాలకు మాట్లాడే అవకాశం రావడం లేదు

భారత్ జోడో యాత్రతో విద్వేషాల బజారులో ప్రేమ దుకాణం తెరిచినం

రాజకీయాలు ప్రజల ఇష్టానుసారమే నడవాలె

భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ

5

కొత్త కాలానికి తగ్గ కొత్త రాజకీయాలు చేయాలె.. 'టెక్ సావీ' నాయకులు రాజకీయాలను భవిష్యత్తులోకి నడిపించాలె






## ప్రజాకాంక్షలు నెరవేర్చాలనే మాకు అధికారమిచ్చిండ్రు

రైతులు, యువత, మహిళలే మా ప్రభుత్వ భాగస్వాములు

తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేటందుకే దేశదేశాల్లో పర్యటిస్తున్నం

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు

భారత్ సమ్మిట్‌లో హైదరాబాద్ రిసొల్యూషన్ ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి

5



## పోప్ ఫ్రాన్సిస్‌కు అంతిమ వీడ్కోలు

సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో ఖననం

రాష్ట్రపతి ముర్ముతో సహా అంత్యక్రియలకు హాజరైన

ట్రంప్, మెక్రాన్, కీర్ స్టార్మర్, జెలెన్ స్కీ

అంతిమ యాత్రలో పాల్గొన్న దాదాపు లక్షన్నర మంది



5

## మీడియాకు మార్గదర్శకాలు

సైనిక, భద్రతా ఆపరేషన్ల రిపోర్టింగ్‌పై నిబంధనలు

ఉల్లంఘిస్తే కఠిన చర్యలని కేంద్రం హెచ్చరిక

హైదరాబాద్, మనం ప్రతినిధిః సైనిక కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలు చేయవద్దని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. టీవీ ఛానళ్లు, వార్తా సంస్థలు, డిజిటల్ ప్లాట్ ఫారమ్ లు, సోషల్ మీడియా వినియోగదారులు సహా అందరూ రక్షణ, భద్రత సంబంధిత అంశాలపై వార్తలు ఇచ్చేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రస్తుత చట్టాలు, ...మిగతా 5లో









# కర్రెగుట్టలపై బాంబుల వర్షం

## హెలికాప్టర్, డ్రోన్‌లతో కురిపిస్తున్న భద్రతాదళాలు



మావోయిస్టులకు భద్రతా బలగాలకు భీకర పోరు

38 మంది మృతి చెందారంటూ మీడియాలో ప్రసారం

మావోయిస్టుల పుట్టి ముంచిన లేఖ

చర్ల, ఏప్రిల్ 26 (మనం న్యూస్): తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై భద్రతా బలగాలు, మావోయిస్టుల నడుమ భీకరపోరుసాగుతోంది. ఇరు వర్గాలు హోరాహోరీగా తలపడుతుండటంతో కర్రెగుట్టలు రణరంగంగా మారాయి. రాత్రీపగలు తేడా లేకుండా 24 గంటలు హెలికాప్టర్లు, ...మిగతా 5లో

నాసిరకం పనులతో కేసీఆర్ ప్రభుత్వం

## కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేసింది : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మనం బ్యూరో: కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేసిందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇంత పెద్దమొత్తంలో అవినీతి చేస్తే ఇతర దేశాలలో పెద్ద శిక్షలు పడేవని వ్యాఖ్యానించారు. శనివారం ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.వేల కోట్ల అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారు. కాళేశ్వరం, సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా ...మిగతా 5లో

## రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ మోసం చేసిండు

కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల పనికేరావని ఎన్‌డిఎస్‌ఏ నివేదిక ఇచ్చింది : మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మనం బ్యూరో: రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి రాష్ట్ర ప్రజలను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలివున్న వారెవరైనా కాళేశ్వరం ...మిగతా 5లో

దారులన్నీ ఎల్కతుర్తికే..

## రికార్డు స్థాయిలో ఏర్పాట్లు

కేసీఆర్, కేటీఆర్ కీలక ప్రసంగాలు

భవిష్యత్ ప్రణాళికల ప్రకటన

ఉత్సాహంగా కదులుతున్న గులాబీ శ్రేణులు

చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ




హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అవతరించి 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లోని ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను భారీ స్థాయిలో నిర్వహించనుంది. లక్షలాది మంది ప్రజలు హాజరయ్యే ఈ సభ కోసం రికార్డు స్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సభలో కేసీఆర్, కేటీఆర్ కీలక ప్రసంగాలు చేయనున్నారు. ఈ వేదికనుంచి బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ ప్రణాళికలను కూడా వివరించనున్నట్టు తెలుస్తోంది. ఈ సభ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపనుంది.

**బీఆర్ఎస్ రజతోత్సవ సభ..**

ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. ప్రత్యేక తెలంగాణ సాధనే ధ్యేయంగా 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన, ...మిగతా 5లో

## పాక్ వెన్నులో వణుకు పుట్టిస్తం

- పహల్గాం ఘటనకు ప్రతీకార చర్యలుంటాయ్
- కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : పహల్గామ్ ఘటనకు ప్రతీకారంగా దాయాది పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టేలా భారత్ చర్యలు ఉంటాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. శనివారంనాడు ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వంద మందికి నియామక పత్రాలు అందజేశారు. ఆ తర్వాత బండి ...మిగతా 2లో

### కేసీఆర్‌కు కుటుంబ సభ్యుల నుంచే ప్రాణహాని

అందుకే ఫామ్ హౌస్‌లో ఉంటున్నడు

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

5

భారత ఉద్యోగితలో 'వైరుధ్య' పరిణామాలు!

## ఉద్యోగాలు.. నిరుద్యోగం రెండూ పెరుగుతున్నయ్

WORLD BANK

పనిచేసే వారికంటే వేగంగా ఉద్యోగాలే పెరుగుతున్నయ్

- మరో పక్క నిరుద్యోగ యువత శాతం పెరుగుతోంది
- 29 శాతం మంది ఉన్నత విద్యావంతులు ఉద్యోగాన్వేషకులుగానే ఉంటున్నరు
- ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు హెచ్చుతున్న వలసలు
- శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్య వృద్ధి
- మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ లింగ వివక్ష ఏమాత్రం తగ్గలేదు
- ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 26: భారత దేశంలో ఉద్యోగాల పెరుగుదలకు సంబంధించి ప్రపంచ బ్యాంకు ఒక నివేదిక విడుదల చేసింది. ఉద్యోగాల పెరుగుదలలో వాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు అది తెలియజేస్తుంది. 2021-22 నుంచి దేశంలోని కార్మిక మార్కెట్ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని తెలిపింది. ఇందులోభాగంగా నాటి నుంచి పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయని వెల్లడించింది. అంతేకాకుండా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు ఆ నివేదిక తెలిపింది. గత మూడేండ్లుగా దేశంలో పనిచేసే జనాభా కంటే ఉపాధి వృద్ధి స్థిరంగా ఉందని.. పట్టణాలలో ...మిగతా 5లో

మనం Manam


## శాంతి యజ్ఞం

కరోనా చీకటి కోరల్లోంచి మేలుకొని
ఇప్పుడిప్పుడే
వెలుగు రేఖల్ని ఆస్వాదిస్తున్న వాళ్ళము

కాళ్ళు ముడుచుకొని ముడుచుకొని
ఇరుకు ఇరుకుగా కదిలిన వాళ్ళం
ఇప్పుడిప్పుడే
సువిశాల ప్రపంచం అనుభవిస్తున్న వాళ్ళము

స్వతంత్ర భారతంలో
చెంగు చెంగున ఎగిరి దునికే జింకపిల్లలం
పల్లె దాటినా పట్నం దాటినా
పంజా విసిరే పులులుంటాయని తెలుసు
మనుషుల రూపంలో హైనాలు తిరుగుతాయని
గుండెలు చీల్చి నెత్తురు తాగుతాయని
తెలుసూ

భూలోక స్వర్గంలో
నరకపు లోయలుంటాయని
మనుషుల్ని శవాలు చేసి
పండుగ చేసుకునే రాక్షసులు ఉంటారని
తెలుసూ

అయినా
ప్రేమ లోకంలో
రెక్కలు కట్టుకుని ఎగురుతున్న పక్షులం
ఒక పక్షి నేల కూలితే
ఇంకో పక్షి కన్నీరయితే
గురి పెట్టిన బాణం కూడా ఘంటమయ్యి
మహాకావ్యం పాడుతుందని నమ్మిన వాళ్ళం

శాంతి దేశంలో పుట్టినందుకు
శాంతి స్థాపనకు ఆహుతి అయ్యే సమిధలం.

**- గజ్జెల రామకృష్ణ**
8977412795

# నీతి కథలతో పిల్లల్లో మనోవికాసం.. !



కథలు చెప్పడం అనాదిగా వస్తున్న సదాచారం. చిన్నతనంలో పిల్లలు అన్నం తినడానికి మారాం చేస్తే అనగనగా ఒక రాజు అంటూ నీతి కథలు చెప్పేవాళ్లు. అమ్మ, నాన్న, తాత, నాన్నమ్మ లేదా అమ్మమ్మలు కథలు చెబితే జోలపాట వలె వింటూ నిద్రలోకి జారుకునే వారు చంటి పిల్లలు. అమ్మమ్మ



కథలు పిల్లల జీవితాలను మార్చుతాయని సామెత కూడా ఉన్నది. నేటి డిజిటల్ యుగంలో కథలు చెప్పే ఓపిక పెద్దలకు, కథలు వినే శ్రద్ధ పిల్లల్లో క్రమంగా తగ్గుతోంది. అన్ని వయస్సుల వారికి కథలు వినడం చాలా ఇష్టంగా ఉండేది. ముఖ్యంగా పిల్లలు నీతి కథలు, నాటి చందమామ కథలు, అలనాటి బాలమిత్ర కథలు వినడానికి ఆసక్తి చూపే వారు. నాటి ఉమ్మడి కుటుంబాల్లో తాతలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు ఆయా కుటుంబాల్లోని పిల్లలు, యువతకు రామాయణ మహాభారత కథలను ఆసక్తికరంగా వివరించే వారు. ఆ కథలను జీర్ణించుకున్న పిల్లలు తమ మనో విస్తృతిని పెంచుకుంటూ సన్మార్గంలో నీతి నియమాల చట్రంలో గౌరవంగా జీవించే ప్రయత్నాలు చేసేవారని మనకు తెలుసు. తరతరాలుగా కథలు ఒకరి నుంచి మరొకరికి చెప్పబడుతూనే ఉన్నాయి, విలువల బోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా రాబోయే తరానికి జీవన విలువలను పరిచయం చేయడానికి కథలు చెప్పడం ఎంత ముఖ్యమో తెలపడానికి ప్రతి ఏట ఏప్రిల్ 27న జాతీయ కథలు చెప్పే దినోత్సవం లేదా నేషనల్ టెల్ ఏ స్టోరీని పాటించడం ఆనవాయితీగా మారింది.

**కథలు వినడం, చెప్పడం వల్ల పలు ప్రయోజనాలు:**

కథలు అనేక రకాలుగా ఉంటాయి. మనం ఒక పుస్తకం చదివి లేదా మన అనుభవం నుంచి తెలుసుకొని మరో తరానికి చెప్పడం పెద్దల బాధ్యత అని మరువరాదు. చిన్నతనంలో విన్న పిల్లలు కథలు చెరగని ముద్రలు వేస్తూ జీవితాంతం వారికి మార్గనిర్దేశనం చేస్తాయి. మన బంధువుల్లో లేదా మిత్రుల కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతతో నీతి కథలు పంచుకోవడం ఒక సదాచారమే కాదు అది వారి జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. కథలు చెప్పడం వల్ల చెప్పిన వారికి, విన్న వారికి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి. అమెరికాలో ప్రారంభమైన జాతీయ కథలు చెప్పే దినం సందర్భంగా ప్రజలు కథలు ఇతరులకు పంచుకోవడం వల్ల భావోద్వేగాల నియంత్రణ కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అవగాహన, ఆత్మవిశ్వాసం, మనో విస్తృతి, ఒకరినొకరు కనెక్ట్ కావడం, సామాజిక వాతావరణం సృష్టించడం, ఆలోచనాశక్తి పెరగడం, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించబడడం, భాషపై పట్టు, ప్రేరణ, కొత్త పరిచయాలు, సృజనాత్మక, వినడమనే సుగుణం, సంస్కృతీ వారసత్వాల వితరణ, వాక్కు, కొత్త ఆలోచనలు పురుడు పోసుకోవడం, దయ/సహానుభూతి, ఆశావహ దృక్పథం, ప్రపంచాన్ని చూసే దృక్కోణం, ఇతర నైపుణ్యాలు లాంటివి పెరుగుతాయి.

**మౌఖిక కథల నుంచి ఏఐ కథల వరకు..:**

కథలు చెప్పడంలో మౌఖిక, డిజిటల్, దృశ్య, వ్రాతపూర్వక రూపాలు ఉన్నాయి. సినిమాలు, పుస్తకాలు, కవితలు, పాటలు, పెయింటింగ్లు కూడా కథలు చెప్పే రూపాల్లోకి వస్తాయి. మౌఖిక కథలు చెప్పడం అంటే పురాణ పద్యాలు, శ్లోకాలు, ప్రాసలు, పాటలు లాంటి రూపాలు ఉండవచ్చు. కథలు చెప్పడం పట్ల మక్కువ ఉంటే అనేక కెరీర్ అవకాశాలు (స్క్రీన్ రైటర్, సృజనాత్మక రచయిత, సినీ దర్శకులు, వీడియో గేమ్ రచయితలు, కంటెంట్ స్ట్రాటజిస్టులు, పాడ్కాస్ట్ నిర్మాతలు, స్టోరీబోర్డ్ కళాకారులు, యానిమేటర్స్ లాంటి) కూడా ఉంటాయి. ఒకప్పుడు మనుషులు మాత్రమే చెప్పే కథలను నేడు ఏఐ విప్లవంతో ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పడం చూస్తున్నాం. సాంకేతికత, సృజనాత్మకత కలయికతో ఏఐ తన పరిధిని విస్తరిస్తోంది. ఇది మరింత గొప్ప, వైవిధ్యమైన కథనాలకు దారి తీస్తున్నది.

తల్లితండ్రులు, పెద్దలు తమ డిజిటల్ ప్రపంచపు నీలి తెరల్లోంచి కొంత సమయం తీసుకొని తమ పిల్లలకు కథలు చెప్పడానికి వెచ్చించాలి. పిల్లల్లో వినే కళను కూడా పెంచండి. నేటి పెద్దలు కొంత వరకు తమ పిల్లలకు కథలు చెప్పడం నేర్చుకోవాలి. కథలను వింటూ ఎదిగిన పిల్లల వ్యక్తిత్వం ఇతర పిల్లల కన్న విలక్షణంగా ఉంటుందని గమనించాలి.

**(27 ఏప్రిల్ జాతీయ కథలు చెప్పే దినోత్సవం సందర్భంగా)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మనను నిలబెట్టేది మన బుద్ధి మాత్రమే



బుద్ధి బలం కంటే మించిన సంపద ఈ ప్రపంచంలో ఏదీ లేదు. బుద్ధి బలాన్ని సక్రమంగా ఉపయోగించాలి. తన తప్పులను ఎదుటి వారిపై నెట్టేసి, ఇతరులను ప్రమాదం లోకి పడేసే కుయుక్తులను మేథస్సు అనలేం. స్వార్థం, సంకుచితత్వంతో కూడిన అతి తెలివి తేటలు అనర్థానికి హేతువులు. అవసరానికి వాడుకుని వదిలేసే ప్రబుద్ధుల బుద్ధులు కడకు స్వీయ పతనానికే దారితీస్తాయి.బుద్ధి క్షీణిస్తే పతనం కూడా ప్రారంభమవుతుంది. అదృష్టం అందలం ఎక్కిస్తే,బుద్ధి బురదలోకి జారినట్టు మనముందున్న అవకాశాలను వదిలేసి, మూర్ఖంగా ఏదో సాధించాలని తపించడం అవివేకం. మేథస్సు మానవాళి శ్రేయస్సుకు వినియోగపడాలి. సమాజ హితానికి వినియోగ పడని జ్ఞానం వలన ఫలితం శూన్యం.గ్రంథపఠనం వలన,స్వీయ అనుభవాల వలన, జీవితం నేర్పిన పాఠాల వలన జ్ఞానం



అలవడుతుంది. జ్ఞాన సంపదను స్వీయ ప్రయోజనాల కోసం కాకుండా దేశ హితం కోసం వినియోగించాలి.ఆలోచనల నుండి ఆర్థిక జ్ఞానం అలవడాలి. జ్ఞానం అనేది సాధన వలన లభిస్తుంది. మన మస్తిష్కాన్ని, మనసును ఒక చోట కేంద్రీకరించి, పట్టుదలతో ప్రయత్నిస్తే, జ్ఞానం మన స్వంతమవుతుంది. ఎలాంటి ప్రయత్నం లేకుండా బుద్ధి వికసించదు.మానసిక పరిపక్వత సాధ్యం కాదు. ఈ ప్రపంచంలో జ్ఞానానికి సరితూగే ధనం లేనే లేదు. మేథస్సు మానవులకు లభించిన ఒక వరం.

ఇతర జీవరాశుల కంటే విభిన్నంగా జీవించాలనే తత్వం, ఆలోచన, విషయసేకరణ, ఆచరణ వంటి విశిష్ఠమైన లక్షణాలు మానవ జాతిలో మెండుగా ఉన్నాయి. ఇతర జీవరాశులకు తెలివి తేటలు లేవు అనుకోవడం కూడా అజ్ఞానం వలన జనించిన భావన మాత్రమే. మనతో మమేకమై జీవించే కోటాను కోట్ల జీవరాశులలో అద్భుతమైన తెలివి తేటలున్నాయి. సాలె పురుగు క్షణాల్లో నిర్మించుకునే ఒక రక్షణ వలయం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని సూచిస్తుంది. ఇంతటి విచిత్ర మైన సాలె పురుగు రక్షణ నిర్మాణం మానవులకు కూడా సాధ్యం కాని విషయం. పక్షి తన నివాసానికి ఏర్పరచుకునే గూడును ఒక సారి పరిశీలిస్తే ఆ పక్షి యొక్క తెలివి తేటలు, పనితనం అవగతమవుతాయి. వివిధ రకాల జంతువులు తమను తాము ఇతర బలమైన జంతువుల నుండి కాపాడు కోవడానికి, ఆహారం కోసం ఎన్నో వ్యూహాలను సిద్ధం చేసుకుంటాయి. మొక్కలకు కూడా ప్రాణం,స్పందించే గుణం ఉందన్న విషయం భారతీయ శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ ఏనాడో నిరూపించాడు. తమకు ఆపద వస్తుందనుకున్న సమయంలో కొన్ని కొన్ని జాతుల మొక్కలు తమ రక్షణ వ్యూహాలను అమలు చేస్తాయి. పాములు, తేళ్ళు, తాబేళ్ళు వంటి జీవులు ఆపద సమయంలో ఎలా తమను తాము కాపాడు కోవడానికి ప్రయత్నిస్తాయో మనకు విదితమే. అయితే జీవరాశులన్నీ తమ మనుగడ కోసం ఎంత వరకు అవసరమో,అంత వరకే తమ శత్రువుల పట్ల జాగరూకత వహిస్తాయి. పశుపక్ష్యాదుల్లో లేని అవలక్షణం మనిషిలో స్వార్థం,అసూయ రూపంలో ఏర్పడడం మానవ మేథస్సుకు పట్టిన దరిద్రం. అవసరం లేకపోయినా దురాశతో తోటి మానవులను పీడించుకు తినడం, భూప్రపంచం ఉన్నంత వరకు బ్రతికేయాలనే దుగ్ధతో తరతరాలకు తరగని సంపదను కూడ బెట్టే ఒక అనైతిక ప్రక్రియలో భాగంగా స్వజాతి పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించడం మానవ మేథస్సుకు పట్టిన గ్రహణం.ఈ ధోరణి మారాలి. మన ఆలోచనలు, ప్రతిభ వ్యక్తిగత గుర్తింపుకు,గౌరవానికి తోడ్పడంలో ఎలాంటి తప్పు లేదు. అంతిమ ఫలితం మాత్రం సమాజానికి ఉపయోగపడాలి. అయితే ఒకరి ఆలోచనలను, ప్రతిభను మరొకరు బలవంతంగా లాక్కునే గత కాలం పద్ధతి మారాలి. మేథో మధన ఫలాలు ప్రపంచాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకు రావాలి.మానవ మస్తిష్కంలో ఏర్పడిన ఆలోచనలకు,ఆసక్తికి సాధన తోడైతే దానికి ప్రయోగాత్మక పరిశీలనా దృక్పథం రంగరిస్తే వెలువడిన అమూల్యమైన సంపద జ్ఞానం. అలాంటి జ్ఞానం ఎన్నో మలుపులు తిరిగి,ఎన్నో అధ్యయనాలకు దారితీసి, ఎంతో మంది మేథావుల మస్తిష్కాలకు పదును పెడితే, ఎన్నో చర్చలు మేథో మధనం తర్వాత ఒక మహత్తరమైన ఆవిష్కరణకు రూపకల్పన జరుగుతుంది. అది ప్రపంచానికి,దేశానికి ఎంతో ఉపయుక్తకరమైన అంశంగా రూపం సంతరించుకుంటుంది. ఒక సకారాత్మక దృక్పథంతో కార్యసాధన చేస్తే, మానవ మేథస్సు ఒక అద్భుతమైన ఉత్పత్తిని సమాజానికి అందిస్తే అదే నిజమైన ఆస్తి. అదే ప్రపంచానికి నిజమైన వారసత్వ సంపద. జ్ఞానం నుండి వెలువడ్డ ఇలాంటి సంపదను మేథో సంపదగా అభివర్ణించవచ్చు. పూర్వకాలంలో తెలివితేటలను కొంతమందికే పరిమితం చేసేవారు. మేథావులు తమ తెలివి తేటలను ఇతరులకు పంచే వారు కాదు. కేవలం తమ కుటుంటాలకే పరిమితం చేసేవారు. కొంత మంది తెలివితేటలను ఈ సమాజం బలవంతంగా అణచివేసి ఆనందించింది.ఇలాంటి అసూయ వలన అనర్థాలే తప్ప సమాజానికి మేలు జరగలేదు.

ఈ సత్యాన్ని గ్రహించి పలు దేశాలు తమ ప్రజల ఆలోచనలను,తెలివి తేటలను చాలా తెలివిగా వినియోగించుకుని, ఇతర దేశాల మేథస్సును కూడా దొంగిలించి, అది తమ దేశాల గొప్పతనం గా ప్రచారం సాగించడం చూశాం. ఇలాంటి క్రమంలోనే భారత దేశం తమ విలువైన మేథాసంపత్తిని విదేశాలకు ధరాదత్తం చేసింది. తెరవెనుక తతంగాన్ని గుర్తించలేక, తమ మేథాసంపత్తిని బాహ్య ప్రపంచానికి తెలపడంలో విఫలమైనది. మేథో సంపత్తి హక్కుల పేరుతో భారతీయ మేథస్సు చౌర్యానికి గురైనది. భారతీయ సాంప్రదాయాల్లో నిక్షిప్తమైన అనేక శాస్త్రీయ ఆలోచనలు మూఢ నమ్మకాల ముసుగులో మూలన పడిపోతే, వాటిని తెలివిగా ఒడిసి పట్టుకుని పేటెంట్ హక్కులు సంపాదించి, వాటి ఫలితాలను తిరిగి ప్రపంచ దేశాలకు అమ్ముకుని, ఆర్థికంగా ఎదుగుతున్న దేశాలను చూసి చేష్ఠలుడిగి నిలబడ్డ అసహాయత చాలా కాలం కొనసాగింది.మన దేశంలో ఎంతో మంది శాస్త్రవేత్తలు తమ పరిశోధనలతో ప్రపంచాన్ని అబ్బుర పరిచారు. కాని వారి కృషికి తగిన గుర్తింపు లభించలేదు. ప్రాచీన నాగరికతకు పుట్టినిల్లు భారతదేశం. సైన్స్ అంటే ప్రపంచానికి తెలియని రోజుల్లో చరకుడు,సుశృతుడు వైద్య శాస్త్ర రంగంలో అనేక ఫలితాలను ప్రపంచానికి అందించారు. క్రీ.పూర్వమే సుశృతుడు తొలి శస్త్ర చికిత్స చేసి ఆశ్చర్య పరిచాడు. ఆయన అద్వితీయమైన వైద్య పరిజ్ఞానానికి గౌరవంగా మెల్ బోర్న్ లో సుశృతుని విగ్రహం నెలకొల్పబడింది. కాని మన దేశంలో వారికి లభించిన గౌరవం ఏమిటి? కనీసం వారి పేరైనా నేటి భారతీయ యువతకు, విద్యావంతులకు తెలుసా? భారతీయ సంప్రదాయంలో చర్మ సౌందర్యానికి వినియోగించే పసుపుకు సైతం విదేశీయులు పేటెంట్ హక్కులు పొంది, భారతదేశ జ్ఞానాన్ని తస్కరించారు. ప్రపంచ గణిత మేథావులకు సైతం అర్థం కాని మహా గణిత మేథావి శ్రీనివాస రామానుజన్ కు ఎందుకు నోబెల్ బహుమతి దక్కలేదు? మన దేశానికి చెందిన గణిత మేథావిని కనీసం ఆయన మరణానంతరం కూడా మనం భారతరత్న అవార్డునిచ్చి ఎందుకు సత్కరించలేక పోయామో అర్థం కావడం లేదు.ప్రపంచంలోని మేథావులను, వారి ఆవిష్కరణలను గుర్తించడం, వారి పరిశోధనా ఫలితాలకు పేటెంట్ హక్కులకు నివ్వడం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ.వ్యాపారాభివృద్ధికి,నాణ్యతకు వివిధ రకాల ట్రేడ్ మార్క్ లను ప్రకటించడం, పేటెంట్, కాపీ రైట్ చట్టాల పట్ల అవగాహన కలిగించడానికి ప్రతీ ఏటా ఏప్రిల్ 26 వ తేదీన ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం జరుపుకుంటున్నాం. వరల్ ఇంటిలెక్చ్యువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్,' గిప్క్'1970 వ సంవత్సరంలో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. స్విట్జర్లాండ్ లోని జెనీవాలో డబ్ల్యు.ఐ.పి.ఓ. ప్రధాన కార్యాలయం నెలకొల్పబడింది. మేథా సంపత్తికి సంబంధించిన విలువను చాటి చెప్పి, దాని విధానాలను వివరించడం, సేవలను, సహకారాన్ని అందించాలనే సదుద్దేశ్యంతో నెలకొల్పిన ఈ అంతర్జాతీయ సంస్థ మేథావుల ఆలోచనలను ఆర్థిక రూపంలోకి మార్చి,తద్వారా ప్రపంచంలోని ప్రజలకు ఉపకరించే విధంగా ఆర్థిక నిర్మాణానికి సరికొత్త రూపకల్పన చేయాలి. ఒకరు సాధించిన విజయాలను మరొకరి ఖాతాలో జమ చేసుకోవడం మేథస్సుకు జరుగుతున్న అన్యాయం.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# వ్యవసాయానికి జీవ నాడులు





భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకమైన పాత్ర పోషిస్తుంది. కానీ గత కొన్ని దశాబ్దాలుగా హరిత విప్లవం తరువాత హైబ్రిడ్ వంగడాల రాకతో అధిక దిగుబడుల ఆశతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులను వాడడం మొదలు పెట్టారు ఆధారపడటం మొదలుపెట్టారు.

దీని వల్ల తాత్కాలికంగా దిగుబడుల పెరిగినా నేల సారవంతత సహజ ఉత్పాదకత తగ్గిపోయింది. మట్టిలో జీవకణాలు తగ్గుతూ అవి జరిపే రసాయన చర్యలపై గణనీయంగా మార్పులు వచ్చాయి తద్వారా భూమి సజీవ శక్తిని కోల్పోతూ వస్తుంది మళ్ళీ దీనిని పునరుద్ధరించాలంటే రసాయన వ్యవసాయం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి సేంద్రియ వ్యవసాయంలో జీవన ఎరువుల పాత్ర చాలా ప్రముఖమైనది..

జీవ ఎరువులు అంటే ఏమిటి?.... జీవ ఎరువులు అనేవి సూక్ష్మజీవుల ఆధారంగా తయారవుతాయి. ఇవి మట్టిలో జీవకణాల వృద్ధికి దోహదపడతాయి. మొక్కలకు అవసరమైన పోషకాల్ని సహజంగా అందిస్తాయి. రసాయనాల వాడకాన్ని తగ్గిస్తాయి. ఇవి ముఖ్యంగా బ్యాక్టీరియా, ఫంగస్, ఆల్గే వంటి జీవులతో తయారవుతాయి.

**నత్రజని స్థిరీకరణ సూక్ష్మజీవులు:** అజోస్పిరిల్లం, అజటోబాక్టర్, రైజోబియం వంటివి వాతావరణంలోని నత్రజనిని మట్టిలోకి మలచి మొక్కలకు అందిస్తాయి.

**ఫాస్ఫరస్ మొబిలైజింగ్ సూక్ష్మజీవులు:** ఫాస్ఫోబాక్టీరియా, బ్యసిల్లస్ మెగాటీరియమ్ వంటివి అందుబాటులో లేని ఫాస్ఫరస్ను మొక్కలు గ్రహించగలిగే రూపంలోకి మార్చుతాయి.

**పొటాష్ మొబిలైజింగ్ బ్యాక్టీరియా:** మట్టిలో ఉన్న పొటాష్ను మొక్కలు గ్రహించేందుకు సహాయపడతాయి.

**మైకోరైజా:** మొక్కల వేర్లతో సహజీవనం చేస్తూ, పోషకాలను గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. వేర్ల చుట్టూ రక్షణ పొరను ఏర్పరచి, మట్టి ద్వారా వచ్చే వ్యాధులను అడ్డుకుంటుంది.

**మిశ్రమ జీవ ఎరువులు:** విభిన్న సూక్ష్మజీవాలను కలిపి తయారుచేసే మిశ్రమం ఇవి మల్టీ ఫంక్షనల్గా పనిచేస్తాయి. విత్తన శుద్ధిలో, వేరు ముంచడంలో, నీటితో కలిపి డ్రిప్ ద్వారా ఈ జీవ ఎరువులను వాడవచ్చు.

**ఇతర ముఖ్యమైన జీవ ఉత్పత్తులు**

**జీవ శిలీంధ్ర నాశకాలు:** ట్రైకోడెర్మా విరిడీ, సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ - శిలీంధ్ర వ్యాధులను అరికడతాయి.

**జీవ బ్యాక్టీరియా నాశకాలు:** బాసిల్లస్, స్ట్రెప్టోమైసిస్-బ్యాక్టీరియాల వల్ల వచ్చే వ్యాధులపై ప్రభావవంతంగా పనిచేస్తాయి.

**జీవ పురుగుమందులు :** బవేరియా, మెటారిజం, వెర్టిసెలియం, వేప ఆధారిత ఉత్పత్తులు, జీవ సూది పురుగు నియంత్రకాలు (బయో నెమటోసైడ్స్) పాసిలోమైసిస్ - వేర్లపై దాడి చేసే సూదిపురుగుల నివారణకు.

జీవ కలుపు మందులు (బయో హెర్బిసైడ్స్)

కొలటుట్రైకం - కలుపు మొక్కల నియంత్రణకు (ఇప్పటికీ పరిశోధన దశలో ఉంది).

**మొక్కల వృద్ధికి సహాయ పడే జీవులు :**

అజోస్పిరిల్లం, బాసిల్లస్ - వేరు అభివృద్ధికి, వృద్ధికి సహకరిస్తాయి.

జీవ వృద్ధి ప్రేరకాలు (బయో స్టిములెంట్స)

సముద్రపు నాచు, హ్యూమిక్ యాసిడ్ - పూత, ఫలాల పరిపక్వతను వేగవంతం చేస్తాయి.

జీవ వికర్షకాలు (బయో రెప్పలెంట్స్ )

నీమ్ ఆయిల్, వెల్లులి మిశ్రమం - పురుగులను దూరంగా ఉంచుతాయి.

**జీవ ఉత్పత్తుల ప్రయోజనాలు:**

జీవకణాల పెరుగుదల ద్వారా మట్టిని సారవంతంగా మార్చుతాయి.

మొక్కలకు పోషకాల లభ్యత పెరుగుతుంది: నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి మూలికలను మొక్కలు బాగా గ్రహిస్తాయి.

**వేర్ల అభివృద్ధి మెరుగవుతుంది :** వేర్ల పొడవు, వ్యాప్తి పెరిగి మొక్కల స్థిరత్వం పెరుగుతుంది.

వ్యవసాయ వ్యయం తగ్గుతుంది: రసాయన ఎరువుల ఖర్చు తగ్గి, రైతుకు ఆదాయం పెరుగుతుంది.

**పర్యావరణ హితం :** మట్టి, నీరు, గాలి కలుషితం చేయవు. ప్రకృతిని కాపాడతాయి.

సేంద్రియ వ్యవసాయానికి మౌలికం: జీవ ఎరువుల్లేకుండా సేంద్రియ వ్యవసాయం సాధ్యం కాదు. జీవ ఎరువులు రైతు భవిష్యత్తుకు వెలకట్టలేని పెట్టుబడి. ఇవి భూమికి జీవం, పంటలకు పోషణ, రైతుకు లాభం, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించే మార్గం. రైతులు ప్రకృతితో సమన్వయంగా సాగు చేయాలంటే, జీవ ఉత్పత్తులు మార్గదర్శకంగా నిలుస్తాయి

సారవంతమైన భూమి - సమృద్ధిగా పంట - ఆరోగ్యకర సమాజం అనే లక్ష్యంతో ప్రతి రైతు జీవ ఉత్పత్తులను పంటలకు వాడాలి.

జీవన ఎరువులే రైతుల జీవితాలలో వెలుగులు నింపే వనరులు. మట్టిలోజీవం వుంటేనే మనిషికి జీవితం వుంటుంది

**- జి. అజయ్ కుమార్**

## తెల్లారని కాశ్మీర్

మనిషినే
మనిషి చంపేది
ఘోర దుర్మార్గం
అది మతం కాదు
అది కులం కాదు
అది ఒక ఉన్మాదం
దేశం పేర
రాష్ట్రం పేర
ప్రాంతంపేర
కులమతాల పేర కబలించాలనే
ముష్కరుల దుశ్చర్యలు

భూతల స్వర్గం
కాశ్మీరం రక్తసిక్తం
కుంకుమపూల మనుషులు
ముష్కరుల కాల్పులకు
విగతజీవులు
నర నిర్మూలనోన్మాదం

మనుషుల్ని మాయంచేసి
మీరు సాధించేదేమిటి
ఆధునిక ప్రజాస్వామ్యంలో
అన్నింటికీ ఒక పద్ధతి ఉంటుంది
దుర్మార్గులకు పద్ధతులు లేవు

గులాబీలు విరబూసే తోటలో
ఉగ్రవాదానికి అంతం లేదా
మంచుకొండల్లో
ఇనుడు రక్తవర్ణం దాల్చాడు

కార్గిల్ ,లద్దాఖ్
కాందహార్,సియాచిన్
పుల్వామ,పహల్గాం

దేశమంటే
తుపాకుల మోతలేనా
శవాల దిబ్బలేనా
మారణహోమాలేనా?
ఎన్నడు తెల్లారుతుందో ఈ దుర్మార్గం

ఆపిల్ పండ్లు
రక్తపు ముద్దలైనవి
దేవదారులు
మీ చర్యలకు నేలకొరిగినయి
కాశ్మీర జీవనం
రుధిర రహిత నేలకై వలసెల్లిపోతున్నయి
దేశభక్తింటే
ఉగ్రవాదమేనా



మతమంటే
ఆక్రమిత ఉన్మాదమేనా
లోయలు కొండలు
తీవ్ర అలజడులు

వసంతకేళీలు
రక్తపు హోళీలు

**- వనపట్ల సుబ్బయ్య**
9492765358

# కర్రె గుట్టలపై బాంబుల వర్షం

(మూడవ పేజీ తరువాయి)

డ్రోన్ ల ద్వారా భద్రతా బలగాలు బాంబుల వర్షం కురిపిస్తుండటంతో సరిహద్దు గ్రామాలలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. మావోయిస్టు అగ్ర నేత హిడ్మా కూడా ఈ గుట్టలపైనే ఉన్నట్టు సమాచారం. దీనితో మావోయిస్టులకు భారీ ప్రాణనష్టం తప్పదన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

**ఈ తీవ్రత ఇలా ఉండగా..**

మావోయిస్టులు చేసిన చిన్న తప్పిదమే ఈ భీకర ఘర్షణకు కారణమన్న వార్తలు బాగా ప్రచారంలో ఉన్నాయి. అవే నేడు వారి ప్రాణాల మీదకు తెచ్చినట్టు సమాచారం. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన పలువురు గిరిజనులు వంట చెరుకు కొరకు కర్రెగుట్టల వద్దకు వెల్లిన క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలు పేలి పలువురు మృతి చెందడం, తీవ్రంగా గాయపడటం జరిగింది. దీంతో మావోయిస్టులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మావోయిస్టు పార్టీ స్పందించింది. మార్చి 8 వ తేదీన వెంకటాపురం - వాజేడు ఏరియా కమిటి కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదల చేసింది. తమ రక్షణార్థం కర్రెగుట్టల చుట్టూ మందుపాతరలను అమర్చామని, గుట్టల వైపు ఎవరూ రావద్దంటూ శాంత లేఖలో హెచ్చరించారు. లేఖలో పేర్కొన్న అంశాలపై నిఘావర్గాలు దృష్టి సారించాయి. కర్రెగుట్టలపై వందల సంఖ్యలో మావోయిస్టులు తలదాచుకున్నారని నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. దీంతో వేలాది మంది భద్రతా బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టాయి. గత ఐదు రోజులుగా మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను ఒక్కొక్కటి వెలుపలికి తీసి వాటిని నిర్వీర్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం మావోయిస్టుల వేట షురూ అయింది. ముగ్గురు మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో మృతి చెందినట్లు బస్తర్ ఐజి సుందర్ రాజ్ ధృవీకరించినా నేటి వరకు చనిపోయిన మావోయిస్టుల వివరాలు,



మృత దేహాలను బయట పెట్టలేదు. ఇదిలా ఉండగా కర్రెగుట్టలపై రాత్రి పగలు లేకుండా భారీ బాంబు శబ్దాలు వినిపిస్తున్నాయి. మావోయిస్టులు, భద్రతా బలగాల నడుమ భీకరపోరు సాగుతున్నట్లు సమాచారం. సరిహద్దు గ్రామాలైన భీమవరం పాడు, ఊట్లపల్లి, పూజారికాంకేర్ గ్రామాల ప్రజలు బయటకు రావద్దని పోలీసులు హెచ్చరించడంతో గిరిజనులు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాలు డ్రోన్ లు, హెలికాప్టర్ల ద్వారా కర్రెగుట్టలపై బాంబుల వర్షం కురిపిస్తున్నారని పలు మీడియాలో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. 38 మంది మావోయిస్టులు మృతి చెందారంటూ ప్రముఖ టివి చానల్స్ లో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. ఈ విషయమై భద్రాతా బలగాలు, పోలీస్ అధికారులు నోరు విప్పక పోవడంతో అంతా గందరగోళంగా మారింది. మీడియా అతిగా హడావిడి చేస్తున్నారంటూ పోలీస్ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సరిహద్దు ప్రాంతాలలోని వైద్యశాలలు, అంబులెన్స్ లను సిద్ధం చేసారు. పోలీస్ ఉన్నతాదికారులు వెంకటాపురంలో ఉండి పర్యవేక్షిస్తున్నారు. ఛత్తీస్ఘడ్ మీడియా గత రెండు రోజులుగా చర్లలో మకాం వేసి వార్తలను సేకరిస్తోంది. శనివారం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఒక డి ఆర్ జి జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. అతడిని హుటాహుటిన హెలికాప్టర్ ద్వారా వైద్యశాలకు తరలించి చికిత్స అందచేస్తున్నారు. గుట్టలపై ఉన్న వేలాది మంది సాయుధ బలగాలకు అవసరమైన ఆహారం, త్రాగునీటిని హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటం, కిలోమీటర్ కు పైగా ఎత్తుగల గుట్టలపైకి చేరుకొని మావోయిస్టుల వేట సాగిస్తున్న భద్రతా బలగాలు ఎండ తీవ్రతను తట్టుకోలేక పోతున్నారు. పలువురు జవాన్ లకు వడదెబ్బ తగలి అనారోగ్యంకు ఇవ్వడంతో వారిని హెలికాప్టర్ల ద్వారా వైద్య శాలలకు తరలించి చికిత్స అందచేస్తున్నారు. మరోవైపు కర్రెగుట్టలపై మావోయిస్టుల వేట నిలిపివేయాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. కాగా దేశ భద్రత దృష్ట్యా ఉగ్రవాదుల ఏరివేతలో బాగస్వాములైన భద్రతా బలగాల కధలికల వివరాలను బహిర్గత పరచ వద్దంటూ జాతీయ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ క్షితిజ్ అగర్వాల్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసారు.

# పోప్ ఫ్రాన్సిస్ కు అంతిమ వీడ్కోలు

**వాటికన్ సిటీ, ఏప్రిల్ 26:** వాటికన్ సిటీలో 21న కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. ఆయనకు ఇష్టమైన సెయింట్ మేరీ మేజర్ బసిలికాలో భౌతిక కాయాన్ని ఖననం చేసినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఆయన సమాధి వద్ద కార్డినల్స్ ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపాయి. అయితే, చర్చిలో అంత్యక్రియలు ప్రైవేటుగా నిర్వహించారు. కేవలం ఉన్నతస్థాయి కార్డినల్స్, పోప్ సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

అంతకుముందు వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా 50కిపైగా దేశాధినేతలు, వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రముఖులు క్యాథలిక్కుల మతాధిపతికి నివాళులర్పించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై తుది వీడ్కోలు పలికారు. వీరితోపాటు దాదాపు లక్షన్నర మంది సాధారణ పౌరులు పోప్ అంత్యక్రియలను వీక్షించేందుకు వచ్చినట్లు అంచనా. శాంటామారియా చర్చికి ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలోనూ రోమ్ వీధుల్లో లక్షలాది మంది బారులు తీరారు.

**తదుపరి పోప్ ఎవరు?.. రహస్యంగా ఎన్నుకోనున్న కార్డినల్లు**

పోప్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. అంతకు ఒకరోజు ముందే ఈస్టర్ నాడు ప్రజలకు సందేశం ఇచ్చిన పోప్.. జీవితసారాన్ని ప్రపంచానికి గుర్తుచేశారు. శాంతి పునరుద్ధరణ కోసం కృషి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన పోప్ ఫ్రాన్సిస్.. 2013 మార్చి 13న 266వ పోప్గా ఎన్నికయ్యారు. లాటిన్ అమెరికా నుంచి పోప్గా ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తిగా ఆయన ఖ్యాతి గడించారు.

# ఉద్యోగాలు.. నిరుద్యోగం రెండూ పెరుగుతున్నయ్

(మూడవ పేజీ తరువాయి)

నిరుద్యోగ స్థాయిలు తగ్గుతున్నాయని నివేదిక వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం తర్వాత పట్టణ నిరుద్యోగం తగ్గుతూ వచ్చి 2021-22 నాటికి అత్యల్పంగా 6.6 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఉపాధి అవకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయనడానికి ఇదే సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు. ఉపాధి రంగంలో గమనించదగ్గ మార్పుల్లో ఉద్యోగాల కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధికంగా పట్టణ ప్రాంతాలకు వలసలు రావడం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 2018-19 తర్వాత మొదటిసారిగా.. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల వలసలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా శ్రామిక శక్తిలోకి, ముఖ్యంగా వ్యవసాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్నట్లు వివరించింది. మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ వేతనాల్లో లింగ అసమానతలు అలాగే ఉన్నాయని పేర్కొంది. ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ యువత శాతం పెరుగుతుండడంపై ప్రపంచ బ్యాంకు ఆందోళన వ్యక్తంచేసింది.

# సంయమనం పాటించండి

**ఐరాస:** పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అయితే పరిస్థితి మరింత చేయిదాటిపోకుండా భారత్, పాకిస్థాన్ ప్రభుత్వాలు అత్యంత సంయమనం పాటించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విజ్ఞప్తి చేశారు. రెండు దేశాల మధ్య పరిస్థితిని ఆయన జాగ్రత్తగా గమనిస్తున్నారని గుటెరస్ ప్రతినిధి స్టెఫాన్ దుజారిక్ గురువారం విలేకరులకు తెలిపారు. ఉగ్రదాడిని పురస్కరించుకుని భారత్ సింధు జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం గురించి ప్రశ్నించగా రెండు దేశాలూ సంయమనం పాటిస్తూ ఉద్రిక్తతలు పెరగకుండా చూసుకోవాలని దుజారిక్ వివరించారు. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడిని గుటెరస్ తీవ్రంగా ఖండించారు.

# టెర్రర్ డెన్ మటాష్

**శ్రీనగర్, ఏప్రిల్ 26:** పహ ల్గాంలో ఉగ్రదాడి తర్వాత టెర్రరిస్టులను పట్టుకునేందుకు భద్రతా దళాలు తీవ్రం చేశాయి. ఈ క్రమంలో కుప్వారా జిల్లాలో గుర్తించిన ఉగ్రవాదుల రహస్య స్థావరంపై భద్రతాదళాలు దాడులు చేసి, ధ్వంసం చేశారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో ముందడుగని వారన్నారు. మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దర్ని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి.

# రికార్డుస్థాయిలో ఏర్పాట్లు

(మూడవ పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సమితి.. ఎన్ని అడ్డంకులు, మరెన్ని అవహేళనలు ఎదురైనా ఉద్యమమే ఊపిరిగా, రాష్ట్రాన్ని సాధించుకోవాలన్న ఆశనే శ్వాసగా పోరాడి చివరకు అనుకున్న లక్ష్యాన్ని ముద్దడింది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ప్రధాన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ (కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు) తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీఆర్ఎస్.. రాష్ట్రం సిద్ధించిన తర్వాత.. రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. కాగా.. దేశవ్యాప్తంగా విస్తరించాలన్న ఆలోచనే లక్ష్యంగా.. 2022లో టీఆర్ఎస్ను పార్టీ అధినేత కేసీఆర్.. ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. 3వ సారీ అధికారంలోకి వస్తమనుకున్న గులాబీ పార్టీ.. ప్రస్తుతం ప్రతిపక్ష హోదాలో ఉన్నది.. టీ(బీ)ఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో.. ఈ నెల 27న భారీ స్థాయిలో రజతోత్సవ సభను అత్యంత వైభవంగా నిర్వహించేలా ప్లాన్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ చరిత్రలోనే అతిపెద్ద బహిరంగ సభగా నిలిచిపోయేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**రికార్డుస్థాయిలో ఏర్పాట్లు.. విశేషాలు..**

ఈ రజతోత్సవ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్.. తన బలం, బలగాన్ని అధికార పార్టీకి మాత్రమే కాకుండా దేశమంతా మరోసారి చూపించాలన్న లక్ష్యంతో రికార్డు స్థాయి ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం 1,213 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. 154 ఎకరాల్లో ప్రధాన వేదికను ఏర్పాటు చేశారు. 500 మంది ముఖ్యనేతలు కూర్చునేలా భారీ వేదికను రూపొందించారు. 1,059 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలాన్ని కేటాయించారు. ఇక, వేసవి తీవ్రత దృష్ట్యా.. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 10 లక్షల వాటర్ బాటిళ్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేశారు. 6 అంబులెన్సులు, 12 వైద్య శిబిరాలు, 1,200 తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశారు. పార్కింగ్ నిర్వహణ కోసం 2,000 మంది వాలంటీర్లు నిరంతరం పని చేయనున్నారు. అంతేకాదు.. విద్యుత్ అంతరాయం కలగకుండా 250 జనరేటర్లను ఏర్పాటు చేయటం గమనార్హం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న కరెంట్ మీద తమకు నమ్మకం లేదని.. అందుకే.. తమ సభ కోసం ఓ 250 జనరేటర్లు ఏర్పాటు చేసుకున్నట్టు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కామెంట్ కూడా చేశారు.

**లక్షలాదిగా తరలిరానున్న జనసందోహం, పార్టీ శ్రేణుల ఉత్సాహం..**

తెలంగాణ నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు సభకు తరలిరానున్నట్టు పార్టీ నేతలు చెప్తున్నారు. గులాబీ జెండాలు, పార్టీ శ్రేణుల నినాదాలతో వరంగల్ నగరం మరోసారి మార్మోగనుందంటున్నారు.

# పహల్గాం ఘటనను మా దేశానికి ముడిపెట్టొద్దు

**ఇస్లామాబాద్:** జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో జరిగిన పాశవిక ఉగ్రదాడి వెనుక తమ హస్తం ఉందంటూ భారత ప్రభుత్వం చేస్తోన్న ఆరోపణలను పాకిస్థాన్ తోసిపుచ్చింది. ఆ ఉగ్ర ఘటనను తమ దేశానికి ముడిపెట్టడం తగదంటూ పాక్ పార్లమెంటులోని ఎగువసభ(సెనేట్) శుక్రవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. భారత్ ఆరోపణలు నిస్సారం, నిరాధారమని పేర్కొంది. ఉపప్రధాని ఇషాక్ దార్ ఈ తీర్మానాన్ని సెనెట్లో ప్రవేశపెట్టగా అన్ని పార్టీల సభ్యులు మద్దతు తెలిపారు. 'దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునే పూర్తిస్థాయి సత్తా పాకిస్థాన్కు ఉంది. జల ఉగ్రవాదంతో పాటు సైనిక కవ్వింపులను, దాడిని తిప్పికొట్టగలం' అని తీర్మానం పేర్కొంది.

# ఏం జరిగినా ఎదుర్కొంటాం

(మూడవ పేజీ తరువాయి)

తీవ్రమయ్యాయి. మోడీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని మంత్రులు ఈపాటికే నోరు పారేసుకున్న విషయం విదితమే. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మొదటి సారి స్పందించారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ వ్యాఖ్యానించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. 'పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం' అని ప్రకటించారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి ప్రవచనాలు పలికారు. ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. 'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ భారత్ ను నిందించే ప్రయత్నం చేశారు.

# మీడియాకు మార్గదర్శకాలు

(మూడవ పేజీ తరువాయి)

నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించింది. ముఖ్యంగా సైనిక చర్యలు జరుగుతున్నప్పుడు ప్రత్యక్ష దృశ్యాలను ప్రసారం చేయడం, సున్నిత ప్రాంతాల నుంచి లైవ్ రిపోర్టింగ్ ఇవ్వడం, 'వర్గాల సమాచారం' పేరుతో వివరాలు వెల్లడించడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది. ఇలాంటి సున్నితమైన ఆపరేషన్ల వివరాలను ముందుగానే బయటపెట్టడం వల్ల శత్రు మూకలకు సమాచారం అందే ప్రమాదం ఉందని, ఇది ఆపరేషన్ల సమర్థతకు, భద్రతా సిబ్బంది ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో కార్గిల్ యుద్ధం, 26/11 ముంబై దాడులు, కాందహార్ విమాన హైజాక్ వంటి సమయాల్లో మీడియా కవరేజీ వల్ల జాతీయ ప్రయోజనాలకు నష్టం వాటిల్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. కేబుల్ టెలివిజన్ నెట్వర్క్స్ (సవరణ) నిబంధనలు-2021లోని రూల్ 6(1)(పి) ప్రకారం భద్రతా దళాలు నిర్వహించే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రసారాలను నిషేధించినట్లు మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. ఆపరేషన్ పూర్తయ్యే వరకు ప్రభుత్వం నియమించిన అధికారి ఇచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రసారం చేయాలని పేర్కొంది. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# పాక్ వెన్నులో వణుకు పుట్టిస్తాం

(మూడవ పేజీ తరువాయి)

మాట్లాడుతూ... పహల్గామ్ పాశవిక దాడి ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. కానీ, తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని అన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అందరూ అండగా నిలివాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# రీ డిజైనింగ్ పేరుతో మోసం చేసిండు

(మూడవ పేజీ తరువాయి)

చేపడతారా ? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారని పేర్కొన్నారు. వాటిలో నీళ్లు నింపితే ఈ పాటికే మొత్తం కొట్టుకొని పోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజనీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్కు పేరు వస్తుందని పక్కన పెట్టారని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# సయోధ్య కుదర్చడానికి మేం సిద్ధం: ఇరాన్

(మూడవ పేజీ తరువాయి)

కీలక ప్రతిపాదన చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, సయోధ్య కుదర్చడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. ''రెండు దేశాలూ మాకు కావాల్సినవే. మా సోదర పొరుగుదేశాలు. వాటితో మాకు శతాబ్దాలుగా సాంస్కృతిక, నాగరికత సంబంధాలు ఉన్నాయి. ఈ కష్ట సమయంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇస్లామాబాద్, దిల్లీలోని మా కార్యాలయాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నాం'' అని పేర్కొన్నారు.నీ భారత్, పాకిస్థాన్ల మధ్య తాజా ఉద్రిక్తతలపై సౌదీ అరేబియా ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ మన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్తో, పాక్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషాక్ దర్తో విడివిడిగా ఫోన్లో మాట్లాడారు.

# కేసీఆర్కు కుటుంబ సభ్యుల నుంచే ప్రాణహాని

**మనం బ్యూరో, హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్కు ఆయన కుటుంబ సభ్యుల నుంచే ప్రాణహాని ఉందని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. అందుకే గత కొన్నేళ్లుగా ఆయన ఫామ్ హౌస్లో విడిగా ఉంటున్నారని పేర్కొన్నారు. శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ ఒకే దగ్గర ఉంటే తనను కుటుంబ సభ్యులే చంపే అవకాశం ఉందన్న భయంతో కేసీఆర్ దూరంగా ఉంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. కన్న బిడ్డలు ఆయనను కలవాలన్నా ముందుగా అపాయింట్మెంట్ ఉండాల్సిందేనని పేర్కొన్నారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై టెక్నికల్ నివేదిక కూడా అందినందున ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చిన అవినీతి డబ్బుతోనే ఆదివారం బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహిస్తున్నారన్నారు. కేసీఆర్ కుటుంబం, అప్పటి ఇరిగేషన్ మంత్రిపై సీబీఐ, ఈడీ విచారణ జరిపి జైల్లో పెట్టాలన్నారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి అత్యంత డేంజర్ అని విమర్శించారు. కేసీఆర్కు ప్రత్యామ్నాయంగా రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రజలు ఎన్నుకుంటే ఆయన పాత అధికారులనే ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు.

# పరిష్కారం భారత్-పాక్ చేతుల్లోనే

(మూడవ పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఖండించారు. ఈసందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ల మధ్య కశ్మీర్ విషయంలో చాలా ఏళ్లుగా గొడవ జరుగుతోందన్నారు. అయితే, దాన్ని ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడితో భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయని ట్రంప్ అన్నారు. రోమ్ పర్యటనకు బయల్దేరిన ట్రంప్ ఎయిర్ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా భారత్-పాక్ ఉద్రిక్తతలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ''ఆ రెండు దేశాలు నాకు చాలా దగ్గర. కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ల మధ్య చాలా ఏళ్లుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇక, తాజాగా పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఒక చెత్త పని. ముష్కరుల దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. అయితే, ఏళ్లుగా నలుగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలను ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 22న పహల్గాం సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

# ప్రజాకాంక్షలు నెరవేర్చాలనే మాకు అధికారమిచ్చిండ్రు

**హైదరాబాద్, మనం బ్యూరో:** భారత్ సమ్మిట్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్లో భాగంగా ఉన్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో దశాబ్దాల పాటు పోరాడిందని పేర్కొన్నారు. విద్యార్థులు, కర్షక కార్మిక సంఘాలు, రైతులు మహిళలు ఉద్యమానికి నాయకత్వం వహించారనీ, వారి పోరాటం ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా గత పదేళ్లుగా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదనీ, తమ ఆకాంక్షల సాధన కోసమే ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను ప్రారంభించామనీ, స్వాతంత్ర్య దినోత్సవం రోజున రూ.20, 617 కోట్లు చెల్లించి 25 లక్షల 50 వేల మంది రైతులను పూర్తిగా రుణ విముక్తులను చేశామని వివరించారు.




యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామనీ, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ నీటిపారుదల, విద్యపై దృష్టి సారించారనీ, ఇందిరా గాంధీ రోటీ, కపడా ఔర్ మకాన్ నినాదంతో పేదరిక నిర్మూలన చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ దేశాలలో జరిగిన పెట్టుబడుల సదస్సులకు హాజరయ్యామన్నారు. ఈ పర్యటనల ద్వారా రూ.2.5 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించడంలో విజయం సాధించామని చెప్పారు. రాష్ట్రంలో 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారనీ, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చూడాలన్నదే మా లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నాసిరకం పనులతో కేసీఆర్ ప్రభుత్వం

(మూడవ పేజీ తరువాయి)

ఉన్నా కూడా అత్యధిక పంట పండింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్డీఎస్ఏ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యాసంగిలో రికార్డు స్థాయిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. ఏడాదిన్నరగా చేసిన కృషి ఫలించి తాజాగా కేంద్ర ప్రభుత్వం సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు. దశాబ్దకాలంగా బీఆరెస్ సాధించలేనిది మేం ఏడాదిన్నరలోనే సాధించాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరం. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# పాతతరం అంతరించింది...యువత రాజకీయాల్లోకి రావాలి

**హైదరాబాద్, మనం బ్యూరో:** దేశ రాజకీయాల్లో పాత తరం అంతరించి పోయింది. ఇప్పుడంతా యంగ్ అండ్ న్యూ పాలిటిక్స్ నడుస్తున్నాయి. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని లోక్సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయనీ, గడచిన పదేళ్లలో ఏం జరిగిందో దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హెచ్ఐసీసీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్ 2025 సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సులో రాహుల్ గాంధీ కీలకోపన్యాసం చేస్తూ పదేండ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవనీ, ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల్లో విపక్షాలకు మాట్లాడే అవకాశం రావడం లేదనీ, అందుకే, తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు నిర్వహించిన భారత్ జోడో పాదయాత్ర ప్రారంభించిన సమయంలో నాతో కొద్ది మంది మాత్రమే ఉన్నారు. పది రోజుల తరువాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగింది. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. సగం దూరం నడిచే సమయానికి నేను గతంలో మాదిరిగా లేను. ప్రజలతో ఎలా మాట్లాడాలి ? వారి సమస్యలు ఎలా పరిష్కరించాలి అనే విషయాలపై వారితో కమ్యూనికేట్ అయ్యేందుకు ప్రయత్నించి సక్సెస్ అయ్యానని వివరించారు. ఈ యాత్రలో ఓ చిన్న అమ్మాయి వచ్చి 'ఐ లవ్ యూ' చెప్పింది ఆ తరువాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్ప్రెస్ చేస్తూ వచ్చాను. హిందీలో ఓ స్లోగన్ తీసుకున్నాం. విద్వేషం అనే బజార్లో ప్రేమ అనే దుకాణం తెరిచా (నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కా దుకాన్) అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారనీ, ఇప్పుడు సమస్యల పరిష్కారానికి ప్రజలే మార్గం చూపిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలు ప్రజల ఇష్టాను సారంగానే ఉండాలి కానీ, పాలకుల ప్రయోజనం కోసం కాదని స్పష్టం చేశారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి దేశం అభివృద్ధిపథకంలో దూసుకుపోతుందన్నారు.

**సారీ... సమ్మిట్కు నిన్ననే రావాల్సింది..**

భారత్ సమ్మిట్లో పాల్గొన్న రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని సారీతో ప్రారంభించారు. సమ్మిట్కు తాను మొదటి రోజే రావాల్సి ఉందనీ, అయితే కాశ్మీర్కు వెళ్లాను..క్షమించండి అని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ నిర్వహిస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయనీ, ఇప్పుడంతా మోడ్రన్ రాజకీయమే కొనసాగుతోందని ఈ తరహా రాజకీయాలకు మనమంతా అలవాటుపడాలని వ్యాఖ్యానించారు.

మనం Manam

Medak
మెదక్

# భూభారతి చట్టంతో అధికారాల వికేంద్రీకరణ

- **పారదర్శకత, జవాబుదరితనమే భూ భారతి చట్టౌ ముఖ్య ఉద్దేశం**
- **రైతులకు అత్యంత ప్రతిష్టాత్మకమైనది భూభారతి చట్టం**
- **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



**హైదరాబాద్, ఏప్రిల్ 26( మనం న్యూస్):** భూ భారతి ( భూమి హక్కుల చట్టం- 2025) ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. పటాన్ చెరు మండలం కేంద్రంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్, రామచంద్రాపురం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్, అమీన్పూర్ మండలం సంబంధించి బాలాజీ కన్వెన్షన్ హాల్లో భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలెక్టర్ పాల్గొన్నారు. పటాన్ చెరు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూభారతి- నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూభారతి చట్టంతో అధికారుల వికేంద్రీకరణ జరిగిందని, పారదర్శకత జవాబుదారితనమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరాలన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చరాని ,భూ సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం భూ భారతి చట్టంతోపాటు, నియమ నిబంధనలు ఒకేసారి తయారు చేసిందని, రికార్డుల నిర్వహణ, సవరణ, రిజిస్ట్రేషన్ ,మ్యుటేషన్, సాదా బైనామ ,పౌతి,వంటి అంశాలను కలెక్టర్ వివరించారు. ధరణిలోని సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమం కోసం తీసుకువచ్చిన భూ భారతి చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ ఉచిత న్యాయ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంతకు ముందు ఉన్న చట్టం లో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, పటాన్చెరు, అమీన్పూర్, రామచంద్రపురం మండలాల తాసిల్దారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు రైతు సంఘ నాయకులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ భూమిని కాపాడాలి



- **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**హైదరాబాద్, ఏప్రిల్ 26 మనం న్యూస్:** అమీన్ పూర్ మండలంలోని ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరూ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అమీన్పూర్ మండలం పరిధిలోని 993 సర్వే నెంబర్ ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన భూములలో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూములలో , కేవలం ప్రభుత్వ అవసరాలకు నిమిత్తం మాత్రమే వాడుకుంటారని, అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని ఆదేశించారు. గుర్తించిన ప్రభుత్వ భూముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట స్థానిక ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తాహసిల్దార్ వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ పాల్గొన్నారు.

# యుజిసి నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి




- **కేంద్ర విద్యాశాఖ, ఎన్.టి.ఏ. అధికారులు**
- **వీడియో కాన్ఫరెన్స్ లో హాజరైన జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26, మనం న్యూస్:** మే 4వ తేదీన నిర్వహించనున్న యుజిసి నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు జిల్లా కలెక్టర్లకు సూచించారు. శనివారం రోజున అన్ని జిల్లాల కలెక్టర్లతో న్యూ ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి హాజరయ్యారు. మే 4వ తేదీన నిర్వహించబోయే యుజిసి నీట్ పరీక్ష పకడ్బందీ నిర్వహణపై కలెక్టర్ కు తగు సలహాలు, సూచనలు జారీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బౌది కలగకుండా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు అందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలను అన్ని విధాలుగా సిద్ధం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఈఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అపరిచితుల పట్ల అప్రమత్తగా ఉండాలి

- **పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి ని పట్టుకున్నపోలీస్ లు**
- **పోలీస్ లను అభినందించిన జిల్లా ఎస్ పి డి. జానకి**




**మహబూబ్ నగర్ 26ఏప్రిల్, (మనం బ్యూరో):** మహబూబ్ నగర్ జిల్లా పోలీసు అధికారి డి. జానకి, మార్గదర్శనంలో, మహబూబ్ నగర్ రూరల్ పోలీసులు బస్ స్టేషన్ మరియు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివిటిపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఒక అనుమానాస్పద వ్యక్తి అమోల్ రాందాస్ పవర్ అమోల్ రాందాస్ షిండే (వయస్సు 38 సంవత్సరాలు, వృత్తి: కూలీ, నివాసం: సోలాపూర్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం) పట్టుబడ్డాడు.వివరాల్లోకి వెళ్తే, అమోల్ రాందాస్ పవర్ వద్ద నుంచి గోల్ చైన్లు, గోల్ బిస్కెట్లు, గోల్ రింగ్స్ కలిపి సుమారు 25 తులాల 9 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, దొంగతనానికి ఉపయోగించిన కట్టర్, ఐరన్ రాడ్ మరియు మొబైల్ ఫోన్ స్వాధీనం చేయబడినవి.పట్టుబడిన నేరస్తుడు విచారణలో గత ఆరు నెలల కాలంలో మహబూబ్ నగర్ పట్టణం పరిధిలో రాత్రి వేళ 13 ఇళ్ల దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. ఇతడు తన మిత్రులు సచిన్, ఆకాష్ బట్, ఆకాశ్ తదితరులతో కలిసి మహబూబ్ నగర్ రూరల్ మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలు చేసినట్లు తెలిపాడు.అమోల్ గత 25 సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాలలో రైల్వే డకాయితీలు, రాబరీలు, ఇంటి దొంగతనాల వంటి నేరాలలో పాలుపంచుకొని పలుమార్లు అరెస్టయి జైలు శిక్ష అనుభవించాడు. ఇతని మీద సుమారు 50-100 నేరాలు వివిధ రాష్ట్రాలలో నమోదైనట్లు గుర్తించబడినది. ప్రస్తుతం అతనిపై కొన్ని వారంట్లు కూడా ఉన్నట్లు సమాచారం.జైలు నుండి విడుదలైన తర్వాత ఇతడు మహీంద్రా ఎక్స్ యు వి మరియు హ్యుందాయ్ జీ20 కార్లను కొనుగోలు చేసి, వాటి నంబర్లు తొలగించి, మొబైళ్లను స్విచ్ ఆఫ్ చేసి గుంపుగా కలిసి ఇతర రాష్ట్రాలలో కూడా దొంగతనాలు చేస్తూ పోలీసులకు ఎస్కేప్ అవుతున్నట్లు విచారణలో వెల్లడించారు. శనివారం అతడు మహబూబ్ నగర్ మరియు జడ్చర్ల ప్రాంతాలలో దొంగతనపు బంగారం అమ్మడానికి ప్రయత్నిస్తుండగా, పోలీసుల చురుకైన చర్యతో పట్టుబడ్డాడు. మిగతా నేరస్తులు పరారీలో ఉన్నారు, వారిని పట్టుకునే చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లా పోలీసులు ప్రజలకు హెచ్చరిక ఇస్తూ, అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద చలనం గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ కేసు నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు డీస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీ నాయక్, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, సీసీఎ స్ ఇన్స్పెక్టర్ నాగరాజు, రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్, నవాబ్పేట్ ఎస్ ఐ విక్రమ్, రూరల్ ఎస్ ఐ 2 చంద్ర మోహన్, పీసీ లింబ్యా నాయక్, రఘు, మహేందర్, శ్రీనివాస్, వెంకటేష్, బాలచంద్రుడు, రఘు, గోపాల్, టెక్నికల్ టీం రియాజ్ అహ్మద్, ప్రవీణ్, రవి, శ్రీనివాసులు, నిరంజన్ వీరందరినీ జిల్లా ఎస్పీ అభినందించారు.

# పిచ్చి కుక్క స్వైర విహారం



**మిరుదొడ్డి, ఏప్రిల్ 26, మనం న్యూస్:** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరుగురిపై దాడి చేసింది. ఉదయం వేళలో బయట కూర్చున్న చిన్న పిల్లలపై, మహిళలపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పది సంవత్సరాలలోపు ఉన్న ముగ్గురు చిన్నారులు బయట ఆడుకుంటుండడంతో పిచ్చికుక్క కరవడంతో వారికి సైతం గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని చాలాసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు వాపోయారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పిచ్చికుక్కను చంపడం జరిగింది.

# రైతు వేదికల్లో సీఎం ఫొటోలను ఏర్పాటు చేయాలి




**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26, మనం న్యూస్:** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోటోలను వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు కేదారి సదాశివరెడ్డి, రాజ్ మహమ్మద్, దేవేందర్ రెడ్డిలు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో రైతు వేదిక గోడల మీద పెయింటింగ్ తో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలను ఏర్పాటు చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఉన్న రైతు వేదికలలో రాష్ట్ర సీఎం ఫోటోతో పాటు, వ్యవసాయ శాఖ మంత్రి ఫోటోలు సైతం ఏర్పాటు చేశారని, కానీ సిద్దిపేట జిల్లాలో మాత్రం ఒక్క రైతు వేదికలో కూడా వారి ఫోటోలను ఏర్పాటు చేయకపోవడం దారుణమని అన్నారు.

# కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- **సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ**

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26, మనం న్యూస్:** కుల సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. శనివారం నాడు నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన గౌడ, రజక, ఏకలవ్య సంఘాల వారు సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పూజల హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వారికి సంబంధించిన అభివృద్ధి పనుల గురించి గత ప్రభుత్వానికి విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని, ఈ ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నామని అన్నారు. పూజల హరికృష్ణ మాట్లాడుతూ జక్కాపూర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున గౌడ సంఘం, రజక సంఘం, ఏకలవ్య సంఘ సోదర, సోదరీమణులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జక్కాపూర్ గ్రామం వారికి సంబంధించిన కమ్యూనిటీ భవనాల అభివృద్ధి గురించి, కుల దైవ టెంపుల్స్ నిర్మాణాల గురించి, కుల సంఘాల ఫంక్షన్ హాల్ అభివృద్ధి పనుల గురించి తమరి దృష్టికి వచ్చిన ప్రతి పనిని తప్పకుండా చేసే బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా తెలియజేసారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మంచి నీటి సమస్య లాంటి కనీస మౌలిక వసతుల కల్పన కోసం తప్పకుండా మొదటి ప్రాధాన్యతలో పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదే విదంగా గతంలో జక్కాపూర్ గ్రామానికి వచ్చినప్పుడు స్థానిక కాంగ్రెస్ నాయకులు హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ మాల దారణాలు చేసినప్పుడు మంచి నీటి సమస్య వస్తుందని అన్నారని, దాని కోసం వచ్చే వారం రోజుల్లో అక్కడ బోర్ వెయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల అశోక్, జక్కాపూర్ గ్రామ కాంగ్రెస్ అద్యక్షుడు బోయిని బాలయ్య, మైనారిటీ అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, గౌడ సంఘం అధ్యక్షులు పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తీగల రమేష్,కోల ఎల్లం, రజక సంఘం అధ్యక్షుడు కారంకంటి పర్శరాములు, కారంకంటి కనకయ్య, లింగయ్య, ఏకలవ్య సంఘం అధ్యక్షుడు బాధనపురం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నీటి కొరత ఏర్పడకుండా చూడాలి

- **జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్**



**సిద్దిపేట, ఏప్రిల్ 26, మనం న్యూస్ ప్రతినిధి:** వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో తగ్గిపోతున్న నీటి వనరుల నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలో ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా వాచ్ డాగ్ కమిటీలు పని చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. శనివారం రోజున స్థానిక ఐడిఓసిలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా స్థాయి వాచ్ డాగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు తరుగుతున్నందున జిల్లా ప్రజలకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా కమిటీ పని చేయాలని సూచించారు. జిల్లాలో రెయిన్ హార్వెస్టింగ్ పై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడానికి ముందుగానే 300 చ.మీ. కంటే ఎక్కువ ఫ్లాట్ ఏరియా ఉన్న అన్ని భవనాలు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ కలిగి ఉండేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, కార్యాలయాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని, వాచ్ డాగ్ కమిటీలు ఎప్పటికప్పుడు జిల్లాలో పర్యవేక్షించాలన్నారు. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజలకు నల్లాల ద్వారా మంచినీరు అందించాలని, అవసరమైన చోట ట్యాం కర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఏప్రిల్ నెలతో ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియ ముగుస్తున్నందున అధికారులకు అందిన దరఖాస్తులపై చర్యలు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ అధికంగా ఉన్న చోట అదనపు సిబ్బందిని నియమించుకొని త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, డిఆర్డీఓ జయదేవ్ ఆర్య, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం

- **జిల్లా కలెక్టర్ మను చౌదరి**




**కొండపాక, ఏప్రిల్ 26, మనం న్యూస్:** జిల్లా స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. శనివారం కుకునూర్ పల్లి కొండపాక మండల కేంద్రంలోనీ రైతు వేదికలో భూ భారతి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎంతో మంది భూ సమస్యలు ఎదుర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకుని గత సంవత్సరం నుండి ఒక సంవత్సరం సుధీర్ఘకాలం ప్రభుత్వం మేధావులు, ప్రజలు, ఇతలరులందరితో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి అసెంబ్లీలో ప్రవేశపెట్టి 14 ఏప్రిల్ 2025 తేదీ నాడు ఈ భూ భారతి చట్టం అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాలలో పైలెట్ ప్రోగ్రామ్ గా తీసుకొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుంది. దానిని పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో రెవెన్యూ సదస్సులో నిర్వహించే ప్రజలను సమస్యలపై అర్జీలను స్వీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టపోతుందని తెలిపారు. సాదా బైనామాలో తెల్ల కాగితం మీద భూ విక్రయాలు జరిగిన వాటి గూర్చి భూ భారతిలో కొత్త చట్టం తీసుకొచ్చారు. రెవెన్యూ రికార్డులో ఒకరి పేరు మీది ఇంకొకరి రావడం, వారసత్వ పరమైన వాటికి ఈ చట్టంలో వెసులుబాటుతో పాటు డాక్యుమెంట్ వెరిఫై, ఫీల్ ఎంక్వైరీ చేసి, ఇరు వర్గాలను పిలిపించి ఇద్దరి వద్ద డాక్యుమెంట్ వెరిఫై చేసి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించే అవకాశం ఈ చట్టంలో కల్పించారు. దీనివల్ల గతంలో కోర్టుకు పోయే కేసులు 99 శాతం జిల్లాలోనే పరిష్కారం అవుతాయన్నారు. భూమికి సంబంధించిన ఎలాంటి విషయాలైనా జిల్లాలో ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో జరుగుతాయని తెలిపారు. గతంలో అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూములను కూడా భూభారతి చట్టం ద్వారా తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అవకాశం ఉందని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వెల్ ఆర్డిఓ చంద్రకళ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ బట్ట పర్శ రాములు మడుపు రెడ్డి నరేందర్ కాసం నవీన్ కుమార్ కృష్ణారెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్ నరసింహా చారి , మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్ ఎంపీడీవో, రైతులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- **శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్):** కులమతాలకు చెందిన పవిత్ర స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా వివిధ కులాల మతాలకు చెందిన పవిత్ర స్థలా ల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలియజేశారు జిల్లాలోని గుడులు మసీదులు చర్చిలు ఇతర కులా సంఘాల వద్ద అత్యాధునిక హై రీజ లుషన్ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు నేరాలను నివారించడంలో నీ కాదు జరిగిన నేరాలను ఛేదించడంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మత సంప్ర దాయాలను ఒకరినొకరు గౌరవించుకున్న కూడా మతసామరస్యం నెలకొంటుందని జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు సహకరిం చాలనినారు. సామాజిక మాధ్యమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సోషల్ మీడియాలో పోస్టులు పెటినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# భూ హక్కులపై రైతులకు భద్రత కల్పించేలా భూ భారతి చట్టం రూపకల్పన

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్




ఖమ్మం, ఏప్రిల్26 (మనం న్యూస్): భూ హక్కులపై రైతులకు భద్రత కల్పించేలా భూ భారతి చట్టం రూపకల్పన చేశామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం సింగరేణి మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్స్ లో నిర్వహించిన తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల) చట్టం- 2025 పై అవగాహన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఆర్డీఓ నరసింహా రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ₹వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ₹ రాజకీయాల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది కాదని, రైతాంగానికి భూ సమస్యల పరిష్కారం, భూ హక్కులు కల్పించే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని అన్నారు. భూ హక్కులపై రైతులకు ఉన్న అభద్రత తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం అనుభవదారు కాలం తొలగించి చిన్న రైతుల పొలాలను ఆసాములకు అప్పగించిందని, నేడు ఆ రికార్డులను భూ భారతి ద్వారా సరి చేస్తామని అన్నారు. గతంలో ఉన్న విఆర్ఓ వ్యవస్థ, అనుభవ దారు కాలం మళ్ళీ వస్తుందని, ఎప్పుడైనా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి పహాణి రాసి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజలు అందించిన సూచనలు కూడా తీసుకొని అవసరమైన మార్పులు తీసుకుని వస్తామని అన్నారు. కార్యక్రమంలో ₹ఆర్డీఓ జి. నరసింహా రావు₹ భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ భారతి చట్టం ద్వారా పక్కాగా భూ సరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు, భూ హక్కుదారులకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే అప్పిల్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యుటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యుటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూ దార్ కార్డు అందించడం జరుగుతుందని అన్నారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల తహసీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీఓ సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి అశోక్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలతోనే విద్యార్థులకు భవిష్యత్



- ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల అద్భుతం
- కళాశాల పేరిట సొంత ఇ.వి.యమ్ మిషన్ సృష్టి...ఎన్నికల నిర్వహణ..
- మిషన్ ప్రదర్శనలో పాల్గొన్న ఛైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు

ఖమ్మం, ఏప్రిల్ 26(మనం న్యూస్): ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఇ.సి.ఇ విభాగం విద్యార్థినులు తమ మేధస్సుతో తయారు చేసిన ఇ.వి.యమ్ మిషన్ ద్వారా కళాశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు ఈ ఎన్నికలను ప్రారంభిస్తూ ప్రజాస్వామ్యంలో ఓటు దేశ గతిని మార్చే ఏకైక ఆయుధమని,ప్రభుత్వాలను మార్చగల శక్తి ఓటుకే ఉంటుందని ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.కళాశాల ఇ.సి ఇ విద్యార్థినులు అధ్యాపకుల పర్యవేక్షణలో ఇ.వి.యమ్ తయారు చేయటం ఎన్నికలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల ఆలోచనలకు కార్యరూపం తీసుకురావటానికి నిరంతరం శ్రమిస్తున్నామని పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తూ నూతన ఆవిష్కరణలు మరిన్ని రావటానికి కళాశాల యాజమాన్యం తోడ్పాటుతో ముందుకు సాగుతున్నామని అన్నారు.మిషన్ ను తయారు చేసిన విద్యార్థినులను అభినందించారు. మనం ఏ దారి చూపుతామో ఆ దారే విద్యార్థినుల భవిష్యత్ ను తీర్చిదిద్దుతుందని భవిష్యత్ అంతా నూతన ఆవిష్కరణలదేనని,ఏ.ఐ,డేటా సైన్స్,క్వాంటమ్ కంప్యూటింగ్ దేనని ఆ వైపుగా కళాశాల తన గమనాన్ని మార్చుకుంటుందని తెలిపారు. ఇ.వి.యమ్ మిషన్ నిర్మాణంలో సారథ్యం వహించిన విభాగాధిపతి డి.రమేష్,టీం లీడ్ నాగరాజు,ప్రాజెక్ట్ డిజైనర్ సాయి, విద్యార్థినులు ఎ.భావన,బి.వినీష,కె.ఆకాంక్ష, కె.శ్రావణిలను కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు అభినందించారు...ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు ఐ.యన్.రావు, యం.వి.రావు,డాక్టర్ విజయలక్ష్మి,కుమారస్వామి పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ

పాకిస్థాన్ డౌన్ టౌన్ హిందుస్థాన్ జిందాబాద్ అంటూ దద్దరిల్లిన అశ్వారావుపేట



అశ్వారావుపేట, ఏప్రిల్ 26(మనం న్యూస్ ): జమ్మూ కాశ్మీర్లో పహాల్గన్ లో జరిగిన ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా ఈ రోజు శనివారం రోజు అశ్వారావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అన్ని రకాల వ్యాపారస్తులు సంపూర్ణ బంద్ పాటించారు.అలాగే అశ్వారావుపేట లోని స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుండి 9.30 నిమిషాల నుండి ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో అన్ని రకాల వ్యాపారస్తులు,మరియు కులమతాలకు అతీతంగా,అన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ బిఆర్ఎస్,బీజేపీ,టీడీపీ,సిపిఎం,సీపీఐ,జనసేన ,ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో పాకిస్థాన్ డౌన్ డౌన్ హిందుస్థాన్ జిందాబాద్ పాకిస్థాన్ ఖబద్దర్ అంటూ భారీగా నిరసన ర్యాలీ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో అన్నీ పార్టీలా రాజకీయా నాయకులు వ్యాపారస్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈద్ మిలాప్ - వక్ఫ్ సవరణ చట్టం 2025 పై ఐక్య బహిరంగ సభను విజయవంతం చేయాలి

- తెలంగాణ ముస్లి ఐక్యవేదిక సంఘం పిలుపు




మధిర, ఏప్రిల్ 26(మనం న్యూస్): ఈద్ మిలాప్ - వక్ఫ్ సవరణ చట్టం 2025 పై ఐక్య బహిరంగ సభను విజయవంతంముస్లిం ఐక్య సంఘం తెలంగాణ కేంద్ర కమిటీ అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ శనివారం మధిర షాది ఖానా నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు జనాబ్ షేక్ హుస్సేన్ సాహెబ్ మరియు ప్రధాన కార్యదర్శి జనాబ్ షేక్ మొహమ్మద్ గౌసుద్దీన్ ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ వారి ఆధ్వర్యంలో, రాష్ట్రంలోని ముస్లిం సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రజా చైతన్యాన్ని పెంపొందించడం, మరియు మత సామరస్యాన్ని మరింత పరిరక్షించడం లక్ష్యంగా, ఒక ప్రత్యేకమైన ఈద్ మిలాప్ - వక్ఫ్ పరి రక్షణ ఐక్య బహిరంగ సభ నిర్వహించబడుతోంది. ఈ బహిరంగ సభ మధిర నందుగల వ్యవసాయ మార్కెట్ యాడ్ నందు ది .30.40.2025న ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించబడుతుంది. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సభకు హాజరయ్యే వారి కొరకు ప్రత్యేక సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. త్రాగునీరు అహ్లాద కరమైనటువంటి చల్లని గాలి సభా కార్యక్రమం అనంతరం భోజన ఏర్పాట్లు విస్తృతముగా ఏర్పాటు చేయుచున్నాము. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉపముఖ్య మంత్రి మరియు ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు , రెవిన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కోణం లేని సాంబశివరావు, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు , మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ,అదేవిధంగా డాక్టర్ రామ్ పునియాని ( భారతీయ రచయిత సామాజిక కార్యకర్త మరియు ప్రముఖ వక్త), హజ్రత్ మౌలానా ఉమారైన్ మెహఫూజ్ రెహమాన్ సాహెబ్, సెక్రటరీ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు, మరియు మౌలానా డాక్టర్ హఫీజుర్ రెహమాన్ సాహెబ్, వ్యవస్థాపకులు సూఫీ శాంతి స్థాపన, ఢిల్లీ వారు హాజరవుతున్నారు. కావున ఈ బహిరంగ సభను విజయవంతం చేయుటకు ముస్లిం సోదరులు, లౌకికవాదులు, అభ్యుదయవాదులు, సామాజిక కార్యకర్తలు, అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాము. ముస్లిం అయితే సంఘం మండల అధ్యక్షుడు షేక్ గాలిబ్ , జనరల్ సెక్రెటరీ జనరల్ సెక్రెటరీ సైదులు , కోశాధికారి షేక్ జాకీర్ హుస్సేన్, సభ్యులు హైదర్ పాల్గొన్నారు.

## నిందితుడు సోషల్ మీడియాలో రిల్స్ అప్లోడ్

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిందితుని వీడియో

నిజామాబాద్ క్రైమ్ మనం న్యూస్ ఏప్రిల్ 26: పోలీస్ వాహనంలోనే ఓ కేసులో ఉన్న నిందితుడు సెల్ఫోన్లో రిల్స్ చేయడం జిల్లా కమిషనరేట్ తో పాటు అన్ని పోలీస్ స్టేషన్లో చర్చనీయాంశంగా మారింది.

పూర్తి వివరాలకు వెళ్తే ఓ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తి పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో నిందితుడికి కోర్టుకు తీసుకెళ్లారు. అయితే వాహనంలో ఉన్న నిందితుడు రిల్స్ చేయడం వాటిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో అది కాస్త వైరల్ గా మారాయి. అంతకుముందు నిందితుడికి కలవడానికి వచ్చిన వ్యక్తులు రీల్స్ తీసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సోహెల్ అనే వ్యక్తి ఈనెల 13వ తేదీన హత్యాయత్నం కేసులో కోర్టుకు తీసుకొచ్చారు. ఆరోజు సోహెల్ కు చెందిన వ్యక్తులు ఈ రిల్స్ తీసినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆ రిల్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.



## పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి దినేష్ కుమార్

- తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
- మండలంలో పలు ప్రాంతాలలో పర్యటన



కరకగూడెం, ఏప్రిల్ 26(మనం న్యూస్): కరకగూడెం మండల పరిధిలో పలు గ్రామాలను ప్రభుత్వ వైద్యశాలను, పెద్దవాగు కోతకు గురైన ప్రాంతాన్ని మండల ప్రత్యేక అధికారి మైనింగ్ శాఖ డి ఈ దినేష్ కుమార్ మండల ఎంపీడీవో దేవ వర కుమార్ తో కలిసి పరిశీలించారు. వైద్యశాలను సందర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందులు అత్యవసర మెడిసిన్ పరికరాల జాబితా సిద్ధం చేసి తమకు అందించాలని వాటిని వివిధ సంస్థల రూపంలో వైద్యశాలకు అందే విధంగా చూస్తామని ఆయన అన్నారు. అనంతరం గత సంవత్సరం వర్షాలకు కోతకు గురైనా పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పెద్దవాగు కోతకు గురైనా ప్రాంతాలను శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని ఆయన అన్నారు. తుది నివేదిక తయారుచేసి కలెక్టర్ కి అందజేస్తామని వారు సూచించిన విధంగా పెద్ద వాగు బ్రిడ్జి కి శాశ్వత పరిష్కారం అయ్యే దిశగా ముందుకు సాగుతామని ఆయన అన్నారు. మండలంలో 16 గ్రామపంచాయతీలలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దేవ వర కుమార్ కు సూచించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవ వర కుమార్, ఎంపీ ఓ మారుతి, కార్యదర్శులు రామకృష్ణ, రవి, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

## అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి హరిబాబు కి విశిష్ట గుర్తింపు

- తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు అరుదైన గౌరవం
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి ఆధ్వర్యంలో డాక్టరేట్ పురస్కారం
- తెలుగు రాష్ట్రాల్లో హరిబాబుకి పలువురి ప్రశంశలు
- సేవలు మరింత విస్తృతం
- తనపై బాధ్యత పెరిగిందని హరిబాబు వెల్లడి




పాల్వంచ, ఏప్రిల్ 26(మనం న్యూస్): ఓ సాధారణ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు పూర్తి చేసుకుని ఇంతింతై వటుడింతై అన్న చందంగా తాను సంపాదించిన దానిలో సమాజ సేవకు ఉపయోగిస్తూ, తనకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు ఉచితంగా అందిస్తూ అరుదైన గౌరవం డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు..పాల్వంచ పట్టణానికి చెందిన అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి తిరుణ హరిబాబు. తెలుగు రాష్ట్రాల్లో విద్య, సామాజిక రంగాల్లో అందించిన సేవలకు తమిళనాడు రాష్ట్రంకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి( ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ ) ఆధ్వర్యంలో శనివారం డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులు డాక్టర్ అరుణ్ చిన్న దురయ్, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ కృష్ణ మూర్తి, డాక్టర్ నరసింహ మూర్తి, డాక్టర్ రవి కుమార్ ల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు చరవాణిలో 'మనం న్యూస్'తో మాట్లాడుతూ.. బాల్యం నుంచి ఎదుర్కొన్న ఒడిదుడుకులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న తనం నుంచి పడ్డ కష్టాలు అత్యున్నత గౌరవ పురస్కారానికి అర్హుడిగా మార్చాయని అన్నారు. అనుకున్నది సాధించడం చదువుకునే వయసు నుంచి అలవాటని, అందుకే విద్యా సంస్థలు స్థాపించి పేద విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి విద్యను తీసుకొచ్చానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో చదువుకునే విద్యార్థులకు ఆర్థికంగా సహకరిస్తున్నామన్నారు. ఎంబీబీఎస్, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు కడుతున్నట్టు గుర్తు చేశారు. గణితంలో స్వయంగా ఇంటర్మీడియెట్ పుస్తకం రచించినట్టు హరిబాబు తెలిపారు. వీటితో పాటు వృద్ధులకు తన వంతుగా దుస్తులు, అన్నదానం ఇతరత్రా సహాయం అందిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్య, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. హరిబాబు డాక్టరేట్ అందుకోవడం పట్ల తెలుగు రాష్ట్రాల్లో పలువురు ప్రముఖులు అభినందనలు తెలుపుతూ.. హర్షం వెలిబుచ్చారు.

# సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలుపరచాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 26 (మనంప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, భూభారతి చట్టాలను సమర్థవంతంగా అమలు పరచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన, భూభారతి చట్టం, జలసంచై జన్ భాగి దారి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు మరియు ఫాం పౌండ్స్ నిర్మాణం మరియు త్రాగునీటి సమస్యల పరిష్కారం పై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లకు గాను ఇప్పటికే మొదటి విడతలో మండలానికి ఒక గ్రామపంచాయతీ ఎంపిక చేసి ఉన్నారని మిగిలిన గ్రామపంచాయతీలలో లబ్ధిదారుల అర్హుల జాబితా క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తమ వద్దకు వచ్చిన జాబితాను సంబంధిత మండలాల ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్ల కు అందజేసి వారు స్థానికంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు మరియు పంచాయతీ సెక్రటరీల తో సమన్వయం పరచుకొని ఉన్న జాబితాలో పేదల్లో నిరుపేద వారిని గుర్తించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. జాబితాలో పేరు లేని ఎవరైనా నిరుపేదలు ఉంటే వారి పేర్లు కూడా జత పరిచి అర్హుల జాబితా తయారు చేసి స్థానిక శాసనసభ్యులు సహకారంతో జాబితా రూపొందించాలని అన్నారు.జిల్లావ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నీ త్వరితగతిన పరిశీలన చేపట్టి అర్హుల జాబితా రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆయా కార్పొరేషన్ల వారీగా క్షేత్రస్థాయిలో బ్యాంకర్లతో కలిసి పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని అన్నారు. రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న వారికి వ్యవసాయ ఆధారిత యూనిట్లు స్థాపన చేసేలా అవగాహన కల్పించాలన్నారు. భూమి ఉన్నవారికి ఆయిల్ పంపు, పందుల పెంపకం, పాడి పరిశ్రమ, పవర్ లోడర్ వంటివి భూమి లేని వారికి చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, పిండి మిల్లు వంటి యూనిట్లు స్థాపించడం ద్వారా వారికి లాభదాయకంగా ఉంటుందని తెలియచెప్పాలన్నారు. జల్ సెంచెయ్ జన్ భాగీ దారి కార్యక్రమం లో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఇంకుడు గుంతలు, ఫామ్ పౌండ్స్ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేపట్టిన నిర్మాణాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి జిల్లాలో అమలులో భాగంగా రెవెన్యూ రికార్డులను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాన్ డిఎస్ కారణాలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ భూ సమస్యల దరఖాస్తులను నివేదిక అందించాలని ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు తమ పరిధిలో ఉన్నటువంటి రేషన్ కార్డ్ దరఖాస్తులు పరిశీలన మరియు ఎన్నికల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిని పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా త్రాగునీటి సమస్య ల పరిష్కారానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పైప్ లైన్ లో లీకేజీ మరియు పంపుల మరమ్మత్తులు ప్రాతిపదిక మీద పూర్తిచేయాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా లో ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్లు తో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలనే ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ త్రాగునీటి సమస్య తలెత్తిన వెంటనే మిషన్ భగీరథ అధికారులు దృష్టికి తీసుకురావాలని వాటిని తక్షణమే వారు పరిష్కరించాలని ఆదేశించారు.

# మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నిర్మూలనకు పని చేయాలి

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపి రెడ్డి**



**మహబూబ్ నగర్, 26 ఏప్రిల్, (మనం బ్యూరో):** మానవ అక్రమ రవాణ వెట్టిచాకిరి నిర్మూలనకు అన్ని శాఖలు పరస్పర సహకారం,సమన్వయం తో పని చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపి రెడ్డి అన్నారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార ఆదేశాల ననుసరించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు మానవ అక్రమ రవాణా,వెట్టి చాకిరి నిర్మూలన పై నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బి.పాపి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి,, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి డి. ఇందిర లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాను మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి రహిత జిల్లాగా రూపొందించాలని అన్నారు.మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నేరం అన్నారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు.చిన్న పిల్లలు, మహిళల మానవ అక్రమ రవాణా గుర్తించేందుకు,ఇటువంటి సంఘటనలు. జరుగకుండా ముందు జాగ్రత్త లు తీసుకోవాలని, సమస్య వచ్చినట్లయితే ఏ విధంగా చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిన విషయాలపై శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు.సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న చట్టాలు క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యాచరణ తో సిద్ధంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా విషయంలో ముంబై, ఢిల్లీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మహబూబ్ జిల్లాలో ఇటువంటి సంఘటనలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలిపారు.పోలీస్ శాఖ వారికి అన్ని శాఖల సహకారం అందించాలని ఆయన కోరారు. చైల్ లేబర్ మరియు మానవ అక్రమ రవాణా పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలను మానవ అక్రమ రవాణా చేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.మానవులను ఒక ఆట వస్తువుగా లైంగిక హింసకు గురి చేయడం,పని మనుషులుగా పని చేయడం కోసం తదితర కారణాల వలన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు దేశాలకు రవాణా చేయడం జరుగుతుందని అన్నారు.ఒరిస్సా,ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి కార్మికులు వలసలు గా వచ్చి పని చేస్తున్నారని, వీరికి సరైన విద్య,వైద్య సదుపాయాలు కల్పించక మానవ హక్కులు కాలరాస్తున్నట్లు తెలిపారు.మానవ అక్రమ రవాణా,బాల కార్మికుల వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రభుత్వం చట్టాలు రూపొందించినట్లు తెలిపారు.మానవ అక్రమ రవాణా, బాల కార్మికుల వెట్టి చాకిరి నుండి సంరక్షించిన వారిని జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం,సుప్రీం కోర్టు ఆదేశాల ననుసరించి పర్యవేక్షణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చైల్ ప్రొటెక్షన్, పోలీసు, కార్మిక శాఖ వైద్య ఆరోగ్య శాఖలు విధ్య, శాఖలు వారికి వారి బాధ్యతలు నిర్వర్తించి వారికి కావాల్సిన సహాయం అందించాలని అన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులకు తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎన్.చంద్రశేఖర్ గౌడ్, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఎన్జీవో) జోబి ఏసుదాస్, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, ఏప్రిల్ 26 ( మనం ప్రతినిధి ):** రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటది వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్లు జరిగిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, వంటి ఏర్పాట్లు చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, మండల ప్రత్యేక అధికారిని జ్యోతి, తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అంబలి, చలివేంద్రం ప్రారంభం

**కామారెడ్డి, ఏప్రిల్ 26 ( మనం ప్రతినిధి ):** టిఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మరియు టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మరియు ఇంచార్జ్ అదనపు కలెక్టర్ చందర్ నాయక్ లు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు ఏర్పాటు చేసిన అంబలి మరియు చలివేంద్రం కేంద్రమును కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., కామారెడ్డి కలెక్టరేట్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని ఇట్టి సందర్భంగా పలు సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజలకు టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం మరియు అంబలి కేంద్రం వారి యొక్క దాహం తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అదేవిధంగా టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అనేది చాలా గొప్ప విషయమని అదేవిధంగా ఇట్టి కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్న టిఎన్జీవోస్ సంఘానికి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ., ప్రతి సంవత్సరం చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ను టీఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు




చేయడం టీఎన్జీవోస్ జిల్లా శాఖ యొక్క ఆనవాయితీగా వస్తుందని ఇట్టి చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రోత్సహిస్తున్న జిల్లా కలెక్టర్ కి మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి ఎం నాగరాజు, సహాధ్యక్షులు ఎం చక్రధర్, కోశాధికారి ఎం దేవరాజు, ఉపాధ్యక్షులు యు సాయిలు, జె. శ్రావణ్ కుమార్, బి లక్ష్మణ్, రాజమణి, బి రాజేశ్వర్ మరియు ఎంపీ పోచయ్య, జాయింట్ సెక్రెటరీలు రమణ, ఖదీర్, రాజమణి మరియు రాజారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్,కల్చరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ఈసీ మెంబర్ శ్రీకాంత్, సాయినాథ్ మరియు అశ్వాక్, కామారెడ్డి అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి మరియు సృజన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ ఏప్రిల్ 26 ( మనం ప్రతినిధి):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే తీరును ఖానాపురం మండల కేంద్రంలో క్షేత్ర స్థాయిలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటిలు, అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పక్కాగా అర్హులకు అందెలా చూడాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపాలని, మంజూరు జాబితా వచ్చిన తరువాత ఇండ్ల నిర్మాణం ప్రారంబించుకోవచ్చునన్నారు. జిల్లాలో 1500 ఇండ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అందులో బెస్ మెంట్ లేవల్ పూర్తయిన 49మంది లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు రూ లక్ష చెల్లించడంఅజరిగిందన్నారు.ఇంటి నిర్మాణానికి అర్థికంగా వెసులుబాటు కోసం సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపుల నుంచి లక్షరూపాయలు రుణం పోందవచ్చునన్నారు. బెస్ మెంట్ లెవల్ బిల్లు రాగానే తిరిగి అప్పు చెల్లించవచ్చునని తెలిపారు. అనంతరం ఖానాపురం మండల కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ భవనంలోని అంగన్ వాడీ కేంద్రం-5 ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అంగన్ వాడి పిల్లలకు పౌష్టికాహరం సరైన మోతాదులో ఇస్తున్నారా పాలు , గ్రుడ్లు ఉన్నాయా వంటి వివరాలను తెలుసుకున్నారు.రికార్డులను తనీఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. అంగన్ వాడీ కేంద్రానికి అవసరమైన వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ వైస్ ఛైర్మన్ శాఖమూరి హరిబాబు , ఖానాపురం తహశీల్దార్ కిరణ్ కుమార్ ,ఎంపిడివో సునిల్ కుమార్ ,ఇంజనీరింగ్ అధికారులు , డీడబ్ల్యువో అధికారి ,రెవిన్యూ అధికారులు స్వామి ,బైరబోయిన ఐలేష్ ,అర్కాల స్వామి , మాచర్ల గోవర్ధన్ ,రవీందర్ ,సుధాకర్ తదితరులు పాల్గోన్నారు.

## ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ




**కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 26 ( మనం న్యూస్ ):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో జమ్మూకాశ్మీర్ లో పర్యాకులపై పైశాచికంగా పాకిస్థాన్ ఉగ్రవాదులు 28 మందిని అతి కిరాతకంగా కాల్చి చంపిన సంఘటనకు నిరసనగా మరియు చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించి, కొవ్వొత్తులతో ర్యాలీ తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ., పర్యటకులపై కాల్పులు జరిపిన పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా మోడీ ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకున్నా భారత ప్రభుత్వానికి మా నైతిక మద్దతు ఉంటుందని తెలియజేశారు. అలాగే దేశంలోనున్న తీవ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న వారిని ఈ దేశ సరిహద్దులు దాటేవరకు తరిమికొట్టి ఉగ్రవాద మూలాలు లేకుండా చూడాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

**డిచ్‌పల్లి మనం న్యూస్ ఏప్రిల్ 26:** రోడ్డు ప్రమాదంలో ఒక కానిస్టేబుల్ కు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన జాక్రంపల్లి మండలం అర్గుల్ గ్రామ సమీపంలో శనివారం ఉదయం ఈ చోటు చేసుకుంది. డిచ్పల్లి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ విధులకు బయలుదేరారు. అర్గుల్ సమీపంలో బైక్ అదుపుతప్పి అక్కడే ఉన్న లారీని ఢీ కొట్టడంతో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ కు జాక్రంపల్లి పోలీసులు చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# భూ సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం

- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్, 26ఏప్రిల్, (మనం బ్యూరో):** భూమికి సంబంధించిన అన్ని సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా లభిస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహబూబ్ నగర్ నగరపాలక పరిధి లోని యుబి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సునుజిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ ుతూ మనందరికీ అన్నం పెట్టే రైతన్నను రాజు చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. భూభారతి చట్టం తో రికార్డుల్లో చిన్న చిన్న ఇబ్బందులు, పొరపాట్లు ఉన్నా, విస్తీర్ణంలో గాని, తమ పేరులో గాని, వారసత్వం విషయంలో గాని ఏవైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ ఆఫీస్ కు పోయి సరి చేసుకోవచ్చు అని ఆయన సూచించారు. ధరణి వల్ల తప్పులు జరిగాయని, అందుకే మళ్ళీ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు నష్టపోరాదని 14 నెలలు శ్రమించి, రైతులకు మేలు చేసే విధంగా భూ భారతి చట్టం తెచ్చామని ఆయన స్పష్టం చేశారు. భూ భారతి చట్టం గురించి ప్రతి ఒక్కరికి బాధ్యత తీసుకొని గ్రామాల్లో వివరించాలని ఆయన చెప్పారు. సన్న వడ్లు పండించాలని రైతులకు నాడు కోరగా 60% మంది రైతులు పండించారని, అలా సన్న వడ్లు పండించిన వారికి బోనస్ కింద ప్రతి రైతుకు 20 వేల నుంచి 40 వేల రూపాయలు అదనంగా వాళ్ళకు వాళ్ళ అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సారి 90 శాతం సన్న వడ్లు పండిస్తున్నారన్నారు. రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గతంలో సన్న బియ్యం పంపిణీ చేయాలన్న ఆలోచన ఎవరికి రాలేదని చెప్పారు.

## భూ భారతి చట్టంతో విస్తృత ప్రయోజనాలు

- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు, ఏప్రిల్26, మనం ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి' (ఆర్.ఓ.ఆర్) చట్టంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శనివారం కన్నాయి గూడెం మండలకేంద్రం లోని రైతు వైదిక లో భూభారతి నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని భూభారతి చట్టంపై, అందులో పొందుపర్చిన అంశాల గురించి కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ అనిత, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు.

## అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయండి

- **కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్/నర్సంపేట: 26 ఏప్రిల్ (మనంప్రతినిది):** అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులు ఆదేశించారు.శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ పరిధిలో, ఖానాపూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా కొనసాగుతున్న రెండో దఫా గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పరిశీలించారు.ఇళ్ల నమోదు చేసిన సమాచారాన్ని (డేటా), భౌతికం గా పరిశీలించారు. ఇళ్ల కేటాయింపుకు అర్హులేనా కదా అన్న విషయాన్ని డేటా ఆధారం గా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని పరిశీలించారు.ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతో జరగాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు నియమించిన ప్రత్యేక అధికారి జాగ్రతతో ఫీల్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు.ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు అర్హతల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. భూమి విస్తీర్ణం 60 గజాలకు మించకూడదని అన్నారు.

# కుంభమేళను తలపించేలా రజోత్సవ వేడుకలు

- **కుంభమేళను తలపించేలా రజోత్సవ వేడుకలు₹**
- **కనీ విని ఎరుగని రీతిలో రజతోత్సవ సభను నిర్వహిస్తున్నాం.**
- **ప్రజల కోసం పనిచేసిన పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ**
- **ప్రతి డివిజన్లో జెండా ఎగర వేసుకొని రజతోత్సవ సభకు బయలుదేరుతున్నాం₹**
- **నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల**







**నిజామాబాద్ ప్రతినిధి మనం న్యూస్ ఏప్రిల్ 26:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ₹నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విలేకరుల సమావేశంలో రజతోత్సవ సభను ఉద్దేశించి మాట్లాడారు....బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ సభ కుంభమేళను తలపించేలా ఉందని అన్నారు. దేశం మొత్తం తెలంగాణలో నిర్వహించే రజతోత్సవ వేడుకను చూసేందుకు తహతహలాడుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణలోని రాష్ట్ర ప్రజలు రజతోత్సవ వేడుకకు స్వచ్ఛందంగా వచ్చేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తన ప్రాణాలను లెక్కచేయకుండా తెలంగాణను తీసుకురావడం జరిగింది. ఉద్యమం నుంచి వెనక్కి వస్తే రాళ్లతో కొట్టి చంపండి అని చెప్పిన మాట గుర్తు చేశారు. దేశంలో తెలంగాణను 29వ రాష్ట్రంగా తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ది.పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కోసం పనిచేసిన పార్టీగా అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగింది.కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బందు, 24 గంటల విద్యుత్ అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిది అని ఆయన అన్నారు.కరోనా విపత్తు వల్ల సంక్షోభం ఏర్పడిన పెన్షన్లు ఆగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజల్లో ఇంకా ముఖ్యమంత్రి కెసిఆర్ ఏ ఉన్నాడని అనుకుంటున్నారు. ఎక్కడ చూసినా రజతోత్సవ చర్చ జరుగుతుందనీ ఆయన సూచించారు. ప్రతి డివిజన్ నుంచి ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణ చేసుకొని బయలుదేరడం జరుగుతుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధర్మారం లో కృష్ణ హోటల్ ఆపోజిట్ రోడ్ లో వాటికి సంబంధించిన మంచినీరు, మజ్జిగ, ఆహారం టోకెన్లు ఇవ్వడం జరుగుతుందనీ ఆయన అన్నారు.అక్కడి నుండి బయలుదేరిన తరువాత మార్గమధ్యం లో ఓ కళ్యాణ మండపం లో అర్బన్ నాయకులు వారిని రిసీవ్ చేసుకొని బోజనాలు అందజేసి అక్కడి నుండి సభకు బయలుదేరుతాం. కని విని ఎరుగని రీతిలో వరంగల్లో జరిగే రజతోత్సవ వేడుక ఏర్పాట్లను ప్రజలు ఎప్పటికప్పుడు టీవీల్లో పత్రికల్లో చూస్తున్నారు.

### బిఆర్ ఎస్ లో భారీగా చేరికలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 35వ డివిజన్ సంబంధించిన నరేష్ ఆధ్వర్యంలో వందమంది యువకులు బి ఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని పార్టీలో చేరినట్లు తెలిపారు.

### గులాబీ టీషర్టులతో కార్యకర్తల హంగామా

రజతోత్సవ వేడుకల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు మరియు కార్యకర్తలు గులాబీ టీ షర్టు వేసుకొని హంగామా చేశారు. డీజే పాటలు పెట్టుకుని డాన్సులు వేశారు. ₹మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల గారు₹ కార్యకర్తలతో స్టెప్పులు వేశారు. సారే రావాలి మళ్లీ కెసిఆర్ రావాలి అంటూ పాటలతో కేకలతో అదరగొట్టారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతి కిరణ్ ,దాదన్న గారి విఠల్ రావు , నగర అధ్యక్షులు సిర్ప రాజు ,మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, రవి చందర్, సత్య ప్రకాష్,దండు శేఖర్, ఏనుగందుల మురళి,దారం సాయిలు,నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, మతీన్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసమే 'భూభారతి'

- చట్టంతో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం
- విచారణ, సర్వే జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు
- గ్రామాల వారీగా రికార్డుల నిర్వహణ
- కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్,ఏప్రిల్26( మనంబ్యూరో):** రైతుల భూ సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ రైతువేదిక, కొత్తపల్లిలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. దరణి చట్టంలో సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించలేదని భూభారతి చట్టంలో మాత్రం పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేలా

ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ధరణి చట్టంలో మాదిరి కాకుండా నూతన చట్టంలో క్షేత్రస్థాయిలో సర్వే చేసి విచారణ జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయనున్నట్లు వివరించారు.దరణి లో ఉన్న 33 మాడ్యూల్స్ కారణంగా రైతులు తమ భూ సమస్య దేని పరిధిలోకి వస్తుందో తెలియక కోర్టులు, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారన్నారు. నూతన చట్టంలో మాత్రం రెండంచెల అప్పీలు వ్యవస్థ తీసుకొచ్చారని అన్నారు. భూమి సవరణల కోసం దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లోగా సమస్య పరిష్కారం అయ్యేలా చట్టం రూపొందించినట్లు వివరించారు. రైతులు తమ భూ సమస్యలకు తహసీల్దార్ వద్ద న్యాయం జరగలేదనుకుంటే ఆర్డీవో వద్దకు.. అక్కడ సంతృప్తి చెందకుంటే కలెక్టర్.. భూమి ట్రిబ్యునల్ వద్దకు వెళ్లి అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.నూతన చట్టంలో అబాదీ, వ్యవసాయేతర భూములు, నివాస స్థలాలకు హక్కులు కల్పించనున్నట్లు వివరించారు. ఆధార్ మాదిరి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి భూకమతానికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఏటా భూ మార్పుల రిజిస్టర్, చెరువులు కుంటలు తదితర నీటి వనరుల రిజిస్టర్, ప్రభుత్వ భూముల రిజిస్టర్, పహానీ వంటి రికార్డులను మెయింటైన్ చేస్తారని తెలిపారు. గతంలో భూమి దరఖాస్తులను పరిష్కరించే అధికారం కలెక్టర్ కు మాత్రమే ఉండేదనిభూభారతి ప్రవేశపెట్టే ముందు తహసీల్దార్, ఆర్డీవోలకు డెలిగేసిన్ ఆఫ్ పవర్స్ ఇవ్వడం ద్వారా గతంలో కలెక్టర్ లాగిన్ లో 11వేల దరఖాస్తులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య రెండు వేలకు తగ్గిందన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని.. అందరి దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

### భూభారతి చట్టం.. రైతుల చుట్టం

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం రైతులకు చుట్టంలా వ్యవహరిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ధరణి కారణంగా చెప్పులు అరిగేలా తిరిగినా.. రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ధరణితో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు వందల ఎకరాలు తమ పేరిట చేసుకున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్ లో నాకు కూడా 20 గుంటలు తక్కువ ఉన్నట్లు నమోదు కావడంతో ఇబ్బంది పడినట్లు తెలిపారు రైతుల సమస్యను అధిగమించేందుకే

భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టంతో తహసీల్దార్, ఆర్డీవో వద్దనే సుమారు 80 శాతం భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ చట్టంపై అవగాహన పెంచుకొని తోటి వారికి వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాజు, రాజేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**సుల్తానాబాద్ ఏప్రిల్ 26 (మనం న్యూస్):** సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన డబ్బులు రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో నూతనషాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులను కలెక్టర్ మంజూరు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు కోసం మున్సిపాలిటీ వెంటనే నిధులను విద్యుత్ శాఖకు చెల్లించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆస్తిపన్ను వసూలు పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్‌పట్టణంలో భవన నిర్మాణ పనులపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో భవన నిర్మాణాలు జరగడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనాల శాఖ భావ్ సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నిహాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రాలీ లను అలాగే 3.75 లక్షల రూపాయలతో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘానికి అందించిన ఆటోను శనివారం స్థానిక నాయకులతో, అధికారులతో ,మహిళలతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన స్కూల్ డ్రెస్ ల మేకింగ్ ను సెంటర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా సంవత్సరానికి రెండు చీరలను మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు ఉపయోగించడానికి వీలు లేకుండా ఇచ్చారని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మండల మహిళా సమైక్యకు ఒక బస్సు ఇచ్చేందుకు ప్రభుత్వం మంజూరి ఇచ్చిందన్నారు. ఈ బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం పొందడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు గత ప్రభుత్వం రద్దు చేసిన బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించనున్నట్టు చెప్పారు. పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి అవినీతికి పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. త్వరలోనే గట్టేపెల్లి నుండి సుల్తానాబాద్ కు కొత్త పైప్ లైన్ ,పట్టణంలో మంచినీటి ట్యాంకులను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యా గౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రాజమల్లు, సాయిరి మహేందర్, దామోదర్ రావు, అబ్బయ్య గౌడ్, బిరుదు కృష్ణ, చిలుక సతీష్, అధికారులు,మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఐదో రోజుకు చేరుకున్నసమ్మె

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్26 (మనంన్యూస్):** ప్రభుత్వాలు ప్రజల బాదలను పట్టించుకోవాలి శాతవాహన విశ్వావిద్యాలయం లో గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న కాంట్రాక్టు, పార్ట్ టైమ్ సహాయ ఆచార్యుల నిరవధిక సమ్మె ఐదవ రోజుకు కు మద్దతుగా శాతవాహన విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది తమ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బోధనేతర సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి పి.ప్రసాద్ మాట్లాడు తూ కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకు లను త్వరగా క్రమబద్ధికరించాలని, సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని అన్నారు.జీవో 21ను సవరిం చాలని, అలాగే పార్ట్ టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.



# ఉగ్రదాడి మృతులకు ఆర్యవైశ్యుల నివాళి



**సుల్తానాబాద్, ఏప్రిల్ 26 (మనం న్యూస్):** జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన భారతీయ పర్యాటకులు, హిందువుల ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్యులు, యూత్ ఆర్యవైశ్య సంఘం , వాసవి క్లబ్ , వాసవి వనిత క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది, అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రదాడిని ఆర్యవైశ్యులందరూ తీవ్రంగా ఖండించారు, దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు, నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపడం జరిగింది,, ద్విచక్ర వాహనాలతో పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు నల్లమాచూ ప్రభాకర్ మాట్లాడుతూ అమాయక పౌరులపై జరిగిన ఈ దాడులు బాధాకరం అన్నారు, ఈ ఉగ్రవాదుల దాడుల సంఘటన సమాజానికి ఎంతో నష్టం కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు, ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి , ప్రధాన కార్యదర్శి తోడుపునూరి రాజేంద్రప్రసాద్ , కోశాధికారి కొమురవెల్లి (కేబి) శ్రీనివాస్ , పల్ల కిషన్, అల్లంకి నందన్న , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొమురవెల్లి శ్రీకాంత్, పల్ల శ్రీనివాస్ (వాసు), నాయకులు పల్ల అనిల్ , పల్ల సురేష్ , అల్లెంకి హరీష్ , నాగమల్ల ప్రశాంత్, పుల్లూరి రమేష్ , సిరిపురం రమేష్ , పల్ల అశోక్ , తాటిపల్లి భూపతి, బాదం కృష్ణ , అల్లంకి హరిప్రసాద్ , కొమురవెల్లి శ్రీనివాస్, పల్ల సంతోష్, చకిలం వెంకన్న , అల్లెంకి సురేష్ , కాసం సత్యనారాయణ , రామిడి రవీందర్, కొమురవెల్లి హరీష్ , కొమురవెల్లి ప్రభాకర్ , కొమురవెల్లి రమేష్ , శివనత్రి వేణు , కొమురవెల్లి భాస్కర్, సముద్రాల ప్రశాంత్ , మహిళా సంఘం లీడర్స్ పల్లా రాజమణి , యాంసాని రమాదేవి , కొమురవెల్లి చంద్రకళ, కొమురవెల్లి సుజాత , కొమురవెల్లి జమున , ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ ఆదాయ మార్గాలకు గండి




**మంచిర్యాల రూరల్, ఏప్రిల్ 26 (మనం న్యూస్ ):** మంచిర్యాల పట్టణంలో చిరు వ్యాపారులు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి వ్యాపారం చేసే ఆస్కారం ఉండకపోవడం వలన వారికోసం కోట్ల రూపాయలు వెచ్చించి అప్పటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మంచిర్యాల నగర సమీపంలోని పాత మంచిర్యాల, ఐ.బి చౌరస్తా, ప్రభుత్వ ఐటిఐ సమీపంలో నిర్మించిన షెడ్లకు సరైన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వలన, షెడ్లు నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా చిరు వ్యాపారులు షెడ్లను వినియోగించుకోవడానికి విముఖత చూపడం లేదు. నిర్మించిన షెడ్ల ద్వారా కార్పొరేషన్ కి ఒక ఏడాదికి 2 లక్షల రూపాయలు ఆదాయం లభించే మార్గమున్న లాభం లేకుండా పోయింది.పట్టణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ సముదాయాలు దాదాపుగా ఒక్కొక్క ప్రాంతంలో 10 షెడ్లను జన సంచారాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మించడం జరిగింది. కానీ అధికారులు ఖాళీ సముదాయాలు నిర్మించారు తప్పితే చిరు వ్యాపారాలు వారి వ్యాపారాన్ని ప్రతిరోజు కొనసాగించాల్సిన పరిస్థితి ఎందుకంటే వారి వ్యాపారం కొనసాగితేనే వారి కడుపునిండే పరిస్థితి, అందువల్ల షెడ్ల నిర్మాణంలో రక్షణ లోపాలు ఉండడం వలన షెడ్లు పాడుపడిపోతున్నాయి. కొంతమంది అక్రమార్కులు ఈ షెడ్లను ఆస్కారం చేసుకొని ఎలాంటి పన్ను చెల్లించకుండా వారి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.చిరు వ్యాపారులు వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రహదారులపై నిత్యం రద్దీగా వాహనాలు ప్రయాణించి జాతీయ మార్గాలలో వ్యాపారం చేస్తూ వారి జీవనాన్ని కొనసాగించడం విచారకరం.కొంతమంది ప్రజా ప్రతినిధులు వారికి వంత పాడే అధికారులు స్వలాభం కోసం అనాలోచితంగా తొందరపాటు నిర్ణయాల వలన ప్రజాధనం దుర్వినియోగ పరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి స్పందించి సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటారని చిరు వ్యాపారులు భావిస్తున్నారు.

# ముందస్తు బడి బాట కార్యక్రమం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 ( మనం న్యూస్):** మండలంలోని డబ్బా గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ముందస్తు బడి బాట 2025-26 అ డ్మిషన్స్ కొరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.1వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం లో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి నర్సరీ, ఎల్ కేజీ. యూకేజీ ప్రవేశ పెడుతుందన్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఉచితంగా బుక్స్, యూనిఫామ్ లు మధ్యాహ్నం భోజనం, రాగి జావా అన్ని లభిస్తాయని అన్నారు. డబ్బా గ్రామస్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని, మన ఊరి బడిని కాపాడుకోవాలన్నారు. 2025-26సంవత్సరం ప్రవేశాలు చేయించుకోవాలని. విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమం లో డబ్బా ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ తనుగుల రమేష్,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్రీమతి లింగంపల్లి లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీ మండలోజు అశోక్, అల్లకట్టు సత్యనారాయణ, చిలుముల రాజేష్, అల్లాడి హరి ప్రసాద్, ఆడెపు నరేష్, బొల్లు శంకర్, అంగన్వాడీ టీచర్ శ్రీమతి గంగామణి పాల్గొన్నారు.



# రాహుల్‌ను విమర్శించే హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదు

- జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజిమ్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్26 (మనం న్యూస్):** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసులో అడ్డంగా దొరికి జైలు పాలై ఆ తర్వాత మితిస్థిమితం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడు తున్నదని కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజిమ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత పై చేసిన కామెంట్ పై స్పందించి న మహమ్మద్ అజిమ్ ఎమ్మెల్సీ కవిత ఉద్దేశించి మాట్లాడుతూ తాను రాజకీయంలో బలంగా ఉన్నానని అపోహ లో దురుద్దేశ్యంతో రాహుల్ గాంధీని కల్వకుంట్ల కవిత విమర్శించడం జరుగుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి పోకుండా నియోజకవర్గం ప్రజలలో సమస్యలను వినిపించకుండా అక్కడ ఉన్న ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే ఆ ప్రజలను కూడా పట్టించుకోని నాయకుడు ఎవరైతే ఉన్నారంటే అది కేసిఆర్ కల్వకుంట్ల కవితలే అన్నారు. బంగారు తెలంగాణ చేస్తా అని అప్పుల తెలంగాణ చేసింది కేసీఆర్ అని విమర్శించారు. కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసులో ఐదు నెలలు జైలు జీవితం గడిపింది నిజము కాదా అని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత జాగృతి పేరుతో వందల కోట్లు సంపాదించింది మీరు కదా అన్నారు. రాహుల్ గాంధీని విమర్శిస్తే ఊరుకునే పరిస్థితి లేదని ఖబడ్దార్ కవిత అంటూ హెచ్చరించారు.

# పదేళ్ల పాలనలో ఒరుగబెట్టిందేమి లేదు

- మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్



**చిగురుమామిడి, ఏప్రిల్ 26 (మనం న్యూస్):** బిఆర్ఎస్ పార్టీ గత 10 ఏళ్లు అధికారంలో ఉండి బడుగు బలహీన వర్గాలకు ఏం ఒరగబెట్టిందని రజితోత్సవ సభ జరుపుతుందో ప్రజలకు చెప్పాలని కెసిఆర్ ను కేటీఆర్ ను మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేయబడిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లు అప్పుల పాలు చేసి, బూటకపు మాటలతో అర చేతిలో వైకుంఠం చూపరన్నారు. వందల మంది దళిత బహుజనులు అసువులు బాసి ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. శ్రీకాంతా చారీ మొదలుకొని పోలీస్ కిష్టయ్య వరకు ఆత్మార్పణ చేశారని, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయ శంకర్, ఆలే నరేంద్ర లాంటి ఎందరో బహుజన నాయకులు పోరాటానికి ఊతమిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం కోసం సబ్బండా కులాలు, సకల జనులు ఆత్మ గౌరవం కోసం పోరాడారన్నారు. దళిత బహుజనుల పోరాటంతో సాధించిన తెలంగాణాలో కేసీఆర్ కుటుంబం మాత్రం అధికారం అనుభవించిందని, వేల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్నదని అన్నారు. బిఆర్ఎస్ హాయములో బహుజనులు బాగుపడ్డదే లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితున్ని ముఖ్యమంత్రిని చేసి తను కాపాల కుక్కలా ఉంటానని మాట తప్పి, దళితులకు మూడెకరాల భూమి ఇచ్చినందుకు రజతోత్సవ సభలు జరుపుతున్నారా అని ఎద్దేవా చేశారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యా, లక్ష ఉద్యోగాలని చెప్పి నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినందుక ఈ రజితోత్సవ సభలంటూ దుయ్య బట్టారు. దళిత బంధు, బీసీ బంధు, రైతు బంధు, డబుల్ బెడ్ రూములు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణి స్కీంలను పక్కకు పెట్టి కారణం రేసు ఫార్ములా, భూ ధందాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్, లిక్కర్ స్కాంలతో అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుండి 23 శాతానికి తగ్గించిందని, కులగణనలో పాల్గొనకుండా బహుజన సమాజాన్ని అవమాన పరిచిందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ కులాల వర్గీకర బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెడితే కేసీఆర్, కేటీఆర్ హాజరు కాకుండా ఆత్మ గౌరవం మీద దెబ్బ కొట్టారన్నారు. ఆత్మ గౌరవ భవనాలని బీసీ కులాలను విడదీసి కేవలం జెండాలు మోయడానికి జై కొట్టడానికి, ఓటు బ్యాంకు రాజకీయాలకు బీసీ సమాజాన్ని ఉపయోగించుకుందన్నారు. ప్రత్యేక తెలంగాణాలో కుటీర పరిశ్రమలు నెలకొల్పి కుల వృత్తులు ఆవిష్కరించబడుతాయని నమ్మిన కులాలకు గొర్లు బర్లు చేపల పేరు జెప్పి వారి జీవనోపాధిని కొల్లగొట్టిందన్నారు. ఈ పత్రిక సమావేశంలో పాల్గొన్నవారు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు రామోజీ రాజుకుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పెసరి శ్రీనివాస్, చీకుట్ల సదానందం, గంగుల లింగం కుమార్ యాదవ్, పచ్చిమట్ల లింగమూర్తి గౌడ్, పోతర్ల శివాంజనేయులు 0పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించాలి



**కరీంనగర్‌టౌన్, ఏప్రిల్26(మనం న్యూస్):** విద్యతో పాటు విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించి వాటిలో నైపుణ్యం సాధించే విధంగా వనరులను అందజేయాలని తద్వారా వారు విజయాలను సొంతం చేసుకుంటారని విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు 'అల్ఫోర్స్' డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత స్విమ్మింగ్ శిబిరాన్ని శనివారం సందర్శించి నిర్వహిస్తున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్యాంపులో భాగంగా విద్యార్థులకు స్విమ్మింగ్ లోని వివిధ రకాల పద్ధతులతో పాటు సిమ్మింగ్ చేసే సమయాన పాటించే నియమ నిబంధనలను నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ నిపుణులు సూచనలను పాటిస్తూ స్విమ్మింగ్ లో నైపుణ్యం పొందాలని సూచించారు . పలు జాగ్రత్తలను పాటిస్తూ క్రీడా స్ఫూర్తిని పరిరక్షించాలని కోరారు.తల్లిదండ్రులు , విద్యార్థులందరూ విద్యతో పాటు క్రీడల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీలు అన్ని రంగాలలో ముందుండాలి



**తిరుమలగిరి, ఏప్రిల్ 26 మనం న్యూస్ః** తెలంగాణతో పాటు దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, చుక్కల సత్యనారాయణ అన్నారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నుండి నేటి వరకు బీసీలు అన్ని రంగాలలో అనిచి వేయబడ్డారని అన్నారు దేశాన్ని ఏలిన పాలకులు బీసీలను కేవలం రాజకీయ జెండాలు మోసే బోయిలుగా ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఏలాంటి సంక్షేమ పథకాలతో పాటు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో ప్రాధాన్యత కల్పించలేదని అన్నారు. దీనికి కారణం పాలకులే తప్ప మరెవరు కాదని చెప్పారు బీసీలలో ఎన్నో కములంగానే నేడు మనం వెనుకబడి పోతున్నామని అన్నారు బీసీల ఐక్యత కోసం ఇప్పటివరకు ఎన్నో సంఘాలు ఆవిర్భవించినా నేటి వరకు కేవలం పత్రికా ప్రకటనలు ధర్నాలు జై కొట్టిన వారే తప్ప బీసీల హక్కుల కోసం లోతుగా వెళ్లి పోరాటం చేసిన వారే లేరని అని తెలిపారు గ్రామ మండల రాజకీయాల్లో బీసీలు ఆర్థికంగా ఎదిగి స్థానిక సంస్థల తో పాటు అన్ని రంగాలలో పోటీచేసి మన సత్తా నిరూపించుకోవాలని వారు చెప్పారు, ఎన్నికల్లో బీసీల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉన్నప్పటికి కేవలం తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణాల వారే తమపై పెత్తనం చెలాయిస్తున్నారని చెప్పారు గ్రామాలలో బీసీలపై దాడులు చేస్తున్న ఈనాటికి పాలకులు స్పందించలేదని అన్నారు. బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో కులపరమైన రక్షణ కల్పించాలని అని కోరారు రాష్ట్రంలో కొండ లక్ష్మణ్ ప్ బాపూజీ, గౌతు లచ్చన్న, బొజ్జ నరసింహులు తదితర నాయకుల మూలంగానే 1966 లో కాసుబ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం బీసీలకు 20% విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించింది కానీ ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో అనంతరామన్ కమిషన్ మురళీధర్ రావు కమిషన్ నివేదిక బీసీల అభివృద్ధికి తోడ్పాడ్డా యని ఆయన అన్నారు రాజకీయ రంగంలో చూసుకుంటే 1980లో టి అంజయ్య ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని అన్నారు 1986లో ఎన్టీఆర్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 20% రిజర్వేషన్లు అమలు చేశారని అన్నారు దేశంలో 1993లో 73 74 రాజ్యాంగ సవరణ ద్వారా పీవీ నరసింహారావు ప్రభుత్వం బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించింది చెప్పారు ఉద్యోగాల్లో మాదిరిగానే స్థానిక సంస్థల్లో మొత్తం త్ 50 శాతానికి మించరాదని డాక్టర్ కృష్ణమూర్తి సుప్రీంకోర్టులో 2010లో తీర్పు ఇచ్చిందని అన్నారు ఈ తీర్పు యావత్ బి సమాజానికి శాపంగా మారిందని ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం 23 శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పిస్తున్నారు. బీసీల హక్కుల సాధన కోసమే కటకం నరసింహారావు ఆధ్వర్యంలో మన ఆలోచన సాధన సమితి స్థాపించారని వారన్నారు మేధావులు బీసీలు అందరూ యువకులు యువకులు, విద్యార్థులు కలిసి రావాలని ఆయన కోరారు ఈ విలేకరుల సమావేశంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు చేను శ్రీనివాస్, గిలకత్తుల రాము గౌడ్,, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం, దేవులపల్లి గణేష్, మెతుకు నరసింహ, పాశం సత్యనారాయణ, చింతకాయల సుధాకర్, లోడే సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారత చట్టం ద్వారా సాదాబైనామ దరఖాస్తుల సమస్యలు పరిష్కారం

## ● కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్



**సూర్యపేట, ఏప్రిల్ 26(మనంప్రతినిధి)ః** రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన భూభారత చట్టం ద్వారా సాదాబైనామ దరఖాస్తుల సమస్యలు పరిష్కారం అవుతాయని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. శనివారం పాలకీడు మండలంలోని గుడు గుంటల పాలెం గ్రామంలో రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన భూ భారతి చట్టం ద్వారా సాదా బయనామ దరఖాస్తుదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ చట్టం ద్వారా 2014 ముందు నటువంటి సాదా బయనామా లబ్ధిదారుల సమస్యలు అన్నింటిని పరిష్కారం అవుతాయని భూభారతి చట్టం ద్వారా ప్రతి రైతుకు భూదార్ కార్డు అందజేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామాలలో భూ సమస్యలు లేకుండా చూసే విధంగా ఏర్పాటు చేసిన నూతన చట్టమే భూభారతి చట్టం అని అన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మి, తహసిల్దార్ కమలాకర్, మండల ప్రత్యేక అధికారి శంకర్ ,వ్యవసాయ అధికారి కళ్యాణ చక్రవర్తి ,నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, నాయకులు గోపాల్, మోతిలాల్ ,సుబ్బారావు ,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం రైతులకు వరం



## ● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ఆత్మకూర్ ఎస్. ఏప్రిల్ 26..మనం న్యూస్:** భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదని అధికారులు గ్రామాలకు వచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నెమ్మికల్ లో ఎస్వీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి లో చాలా సమస్యలు పరిష్కారం కాలేదని రైతులు ఆందోళన చెందారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి ధరణిపై కమిటీ వేసి అద్భుతమైన భూభారతి చట్టం రూపొందించిందని అన్నారు. రెవిన్యూ వ్యవస్థను బలపరిచేందుకు అధికారులను వికేంద్రీకరణ చేస్తూ ప్రతి గ్రామానికి గ్రామ పాలనాధికారులను నియమించడం జరుగుతుందని తెలిపారు. భూభారతి అమలు తర్వాత రెవెన్యూ బృందాలు గ్రామాల వారిగా భూ సమస్యలు పరిశీలించి రైతులకు మేలు జరిగేలా పాస్ పుస్తకాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 279 మంది గ్రామ పరిపాలన అధికారులు రాబోతున్నారని గుర్తు చేశారు. ఇకనుంచి భూ సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరి కిషోర్ శర్మ, ఎంపీడీవో హసీం, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఎంపీవో రాజేష్, ఏపీవో ఈశ్వర్, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్



**తిరుమలగిరి, ఏప్రిల్ 26 మనం న్యూస్ః** తిరుమలగిరి మున్సిపాలిటీలోని అనంతరం గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ హరిప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తమ ధాన్యాన్ని మంచిగా ఆరబెట్టుకొని తేమ శాతం 17 తగ్గ, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్కు ఏ గ్రేడు రూ 23 20లు,బి గ్రేడు రూ 2300లు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జాన్ మహ్మద్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, అర్పీ రేణుక, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాలి

- సమాజంలో న్యాయ వ్యవస్థకు ఎంతో పవిత్రత ఉంది
- న్యాయవ్యవస్థ పవిత్రతను కాపాడుకునేందుకు న్యాయవాదులు కృషి చేయాలి
- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు



**హుజూర్ నగర్, ఏప్రిల్ 26,(మనం న్యూస్)ః** భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలో టియుడబ్ల్యూజే, ఐజేయు యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ డైరెక్టర్ సాముల రామిరెడ్డికి ఆత్మీయ సన్మానం చేశారు.ఈ సందర్భంగా కోలా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో ఎంతో నమ్మకం ఉందని దానిని మరింత నమ్మకం పెంచేలా కృషి చేయాలన్నారు. పేదలకు న్యాయం జరిగినప్పుడే న్యాయవాదులపై మరింత నమ్మకం ఏర్పడుతుంద న్నారు. సమాజంలో న్యాయ వ్యవస్థకు ఎంతో పవిత్రత ఉందన్నారు.దేశంలోని కొన్ని కోర్టులో జరుగుతున్న సంఘటనలు సమాజాన్ని తీవ్రంగా కలిసి వేస్తుందన్నారు.దేశంలో న్యాయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.సమాజంలోని ఇతర వ్యవస్థల కంటే న్యాయవ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంద న్నారు.ప్రాధాన్యత ఆ పవిత్రతను మరింతగా కాపాడుకునేందుకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు న్యాయవాదులకు,జర్నలిస్టులు కూడా కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన ప్యానెల్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు ఎన్ నరేందర్ రెడ్డి, బసవోజు శ్రీనివాస చారి,షేక్ జానీ పాష,కిత రామనాథం,పిల్లలమర్రి శ్రీనివాసు, ఇట్టిమల్ల రామకృష్ణ,రాంప్రసాద్ , రామిరెడ్డి,నాగుల్ మీరా, అంజయ్య,వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

# మైనర్లు వాహనం నడిపితే చర్యలు తప్పవు

- పోలీసు తనికిల్లో పట్టుబడుతున్న మైనర్స్
- తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు
- జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి)** పాఠశాల కళాశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు అని జిల్లా ఎస్పీ కె.నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మైనర్స్ కు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పై, వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అన్నారు. గత కొద్ది రోజులుగా మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడుతున్నారు, పట్టుబడ్డవారికి జరిమానాలు విధిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారు అని పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అజాగ్రత్తగా అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడతారు అలాగే ఇతరులకు ప్రమాదాన్ని కలగజేస్తారు కావున పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవద్దని ఎస్పీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత చర్యలు ప్రతిఒక్కరూ పాటించాలి అని కోరారు. యువత అడ్డగోలుగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారినపడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు దుఃఖం పెట్టవద్దు అని కోరారు. పోలీసు జరిమానాలు విధించడం భద్రత చర్యల్లో భాగమని, మార్పుకోసమే అని తెలిపినారు, వాహనదారులు నిభందనలు ఉల్లంఘించి ఒక సారి జరిమానా కు గురైతే మళ్ళీ అలాంటి తప్పులు చేయవద్దు అని సూచించారు.

# ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ ,కొవ్వొత్తుల ప్రదర్శన




**భువనగిరి, ఏప్రిల్ 26 (మనం న్యూస్):** పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడికి నిరసనగా భువనగిరి పట్టణ వంజరి మరియు యువజన సంఘాల ఆధ్వర్యంలో అమరులైన కుటుంబాలకు శాంతి చేకూర్చాలని కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీని స్థానిక హైదరాబాద్ చౌరస్తా నుండి నల్గొండ చౌరస్తా వరకు యువకులు అత్యంత అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు కాలేరు సందీప్ కుమార్, బానుక బాలకిషన్, రత్నా మల్లికార్జున్, రత్నపురం విక్రమ్, ధాత్రకు రాజు, యాసారం తిరుపతి, పోకల శివకుమార్, ఉప్పల రాము, మాయ శివ కిషోర్, కళ్యాయా నిఖిల్, మరియు రాహుజీ, యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేశారు.

# ప్రైవేటు బడి వద్దు... ప్రభుత్వ బడి ముద్దు




**గరిడేపల్లి,ఏప్రిల్ 26,(మనం న్యూస్)ః** ప్రైవేటు బడి వద్దు...ప్రభుత్వం బడి ముద్దు అంటూ మన ఊరు మనబడి అనే సంకల్పంతో గ్రామస్తులు అందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ విద్యా కమిటీ చైర్మన్ గుగులోతు శాంతి,ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు కోరారు.మండల పరిధిలోని గార కుంట తండా గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చక్కటి విద్యా బోధన లభించే ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లల్ని చేర్పించాలని కోరుతూ ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు వివరించారు.ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపి పాఠశాల బలోపేతం కోసం గ్రామస్తులు సహకరించాలని కోరారు.నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు నరేందర్ నాయక్,సందీప్ నాయక్,ప్రవీణ్ కుమార్,రాజు,రవి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరులో సిపిఐ గ్రామ శాఖల మహాసభ



**చిలుకూరు, ఏప్రిల్ 26 (మనం న్యూస్)ః** పేద ప్రజల పక్షాన మాట్లాడేది , పోరాటం చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు చిలుకూరు మండల కేంద్రంలోని పాత చిలుకూరు గ్రామంలోని కస్తూరి అప్పారావు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిలుకూరు గ్రామ శాఖల మహాసభ జరిగినది. ఈ మహాసభల సందర్భంగా పార్టీ జెండాను స్వాతంత్ర్య సమరయోధులు సిపిఐ సీనియర్ నాయకులు దొడ్డ నారాయణరావు ఆవిష్కరించారు అనంతరం జరిగిన మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని పాలకవర్గాలు కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తూ పేద ప్రజల పొట్ట కొడుతున్నాయని ఆరోపించారు . పేద వర్గాలకు సంబంధించిన నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ బడా కార్పొరేట్ వర్గాల సంబంధించిన వ్యక్తుల లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారని విమర్శించారు పాలకవర్గాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కింది స్థాయిలోని పేదలకు అందుతున్నాయా లేదా అని కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తర్వాత ఏప్రిల్ నెల మే నెలలో జరగనున్న మండల జిల్లా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకత్వం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తెలంగాణ సాయుధ పోరాట సమయంలో అష్టాంగ మహాసభ జరుపుకున్న ఈ చిలుకూరు గడ్డమీద ఎర్ర జెండా నిత్యం ఆడాలని వారు ఆకాంక్షించారు.

# కళ్లలో కారం చల్లి నగలు చోరీ

- పోలీసులకు పట్టుబడ్డ లేడి కిలాడి



**నవీపేట్ మనం న్యూస్ ఏప్రిల్ 26:** కంట్లో కారం చల్లి వృదురాల నుంచి నగలు చోరీ చేస్తుండగా గ్రామస్తులు దొంగ లేడీ కిలాడికి పట్టుకున్నారు. శనివారం నవీపేట్ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నవీపేట్ బస్టాండ్ లో నారాయణపురంకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్నా వృదురాలకు కొందరు దొంగ లేడీ కిలాడీలు మాయ మాటలు చెప్పుకుంటూ నిలిచారు. మాయమాటల్లో ఆ వృద్ధురాలకు కాలకృత్యాలకు వెళ్తుండగా ఆమె వెనుకలోనే ఆ మాయలే డీలు వెళ్లి కంట్లో కారం చల్లారు.వృధారాలకు కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న అన్ని బంగారు ఆభరణాలను దోచుకున్నారు. అయితే వృదురాలు బంగారు నాభరణాలను దోచుకుంటున్నారని అరుపులు కేకలు వేయగా కొద్ది దూరంలో ఉన్న ప్రజలు వెంటనే స్పందించి దొంగ లేడీ కిలాడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అందులో ఒక లేడీ మాత్రమే గ్రామస్తుల చేతులకు దొరికిందని, అనంతరం గ్రామస్తులు నవీపేట్ పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు. నవీపేట్ పోలీసులు దొంగ లేడీ కిలాడిని పట్టుకొని పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు.

# మన పాఠశాల రక్షణ మనందరి బాధ్యత




**పెన్ పహాడ్, ఏప్రిల్ 26 (మనం న్యూస్)ః** మన ప్రభుత్వ పాఠశాలల రక్షణ మనందరి బాధ్యతని ప్రధానోపాధ్యాయులు కే.ప్రభాకర్ అన్నారు శనివారం మండల పరిధిలోని గాజుల మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎల్లప్పకుంట, సీతమ్మ తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను గాజుల మల్కాపురం పాఠశాలకు పంపించాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని పాఠశాల విద్యాబోధన, మౌలికవసతులపై అవగాహన కల్పించి ఇంటి వద్దనే విద్యార్థుల అడ్మిషన్ చేశారు పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం సౌకర్యం, ఏకరూప దస్తులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు ఇంతకుముందు బడిబాట ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు ఎరగాని లింగయ్య ,షేక్ ఉమర్ ,ముదిరెడ్డి వెంకట్ రెడ్డి, రాచూరి శ్రీనివాస్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం ద్వారా ఉచిత న్యాయ సేవలు, క్షేత్రస్థాయిలో నిరుపేదలకు అండగా నూతన చట్టం...

- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య...



మహబూబాబాద్,ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన పథకం భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం - 25, అవగాహన సదస్సు శనివారం బయ్యారం మండల కేంద్రం శ్రీ కోదండ రామచంద్ర స్వామి కళ్యాణ మండపం, గార్ల ఏవిఆర్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) కె.వీరబ్రహ్మంచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి, చదివి రైతులకు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం- 2025 పై అవహన కల్పించారు,

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ...**

ప్రభుత్వం అత్యంత విప్లవాత్మకమైన పారదర్శకంగా వేగంగా ప్రతి భూ సమస్యలకు పరిష్కారం కోసం నూతన భూభారతి చట్టం ప్రవేశపెట్టిందని, రైతులకు నిరుపేదలకు ఎలాంటి భూ సమస్యల రాకుండా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఉచిత న్యాయ సేవలు, సమస్య ఉన్నచోటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యను ఎమ్మార్వో స్థాయి నుండి రెవిన్యూ డివిజన్ అధికారి కలెక్టర్ తదితర స్థాయిలలో వారికి కేటాయించిన సమయాలలో భూ సమస్యను పరిష్కరించడం కోసం ఈ చట్టం ప్రత్యేకత అన్నారు, గత చట్టంలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి సహాయం చేసే అధికారాలు లేక అనేకమంది సివిల్ కోర్టును ఆశ్రయించలేకపోయారు, ఇప్పుడు ఆ సమస్య లేదు అన్నారు, దరఖాస్తులను పరిశీలించి ఇరు వర్గాల వారికి నేరుగా నోటీసులు జారీ చేసి బహిరంగ విచారణ చేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుంది అన్నారు,అప్పీల్ చేసే ఆప్షన్ ఈ నూతన చట్టంలో ఉందని అన్నారు తద్వారా అన్యాయం జరిగిన రైతుకు న్యాయం జరిగేందుకు కృషి చేయొచ్చు అన్నారు, రానున్న రోజుల్లో గ్రామ పాలన అధికారి సర్వేయర్ల నియమించి క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ భద్రంగా ఉండటం జరుగుతుందని పారదర్శకంగా వేగంగా సేవల అందుతాయన్నారు,

**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ...**

దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసం కృషి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచింది అన్నారు,గత ధరణి కాలంలో పేద రైతులు నిజమైన లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు పడ్డారన్నారు, ప్రస్తుతం భూభారతి నూతన చట్టం ద్వారా రైతుకు నిజమైన లబ్ధిదారులకు వెంటనే క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన సమయాలలో సమస్య పరిష్కరించి భూమిని అప్పగించడం జరుగుతుందన్నారు, గతంలో సాదా బైనామా అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ రూల్స్ భూభారతి చట్టం ప్రకారం రికార్డుల నిర్వహణ చేయడం జరుగుతుంది అన్నారు, దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టి పేదవాడి కి కడుపునిండా అన్నం తినే విధంగా చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు,మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, గ్యాస్ పంపిణీ, స్వయం సహాయక ఆర్థిక అభివృద్ధి, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులైన యువతి యువకులకు ఉపాధి కల్పన భరోసా కల్పించడం జరుగుతుంది అన్నారు, రైతు రుణమాఫీ, రైతు భరోసా బోనస్, రైతు సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికా ప్రకారం ముందుకు సాగుతుందన్నారు, (6) గ్యారంటీలు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె .వీరబ్రహ్మచారి మాట్లాడుతూ....**

గత ధరణి పోర్టల్ సమయంలో రెవెన్యూ అధికారులకు చిన్న సమస్యల పరిష్కారం అధికారం కూడా లేకుండా ఉండేదని పేద రైతులు సివిల్ కోర్టుకు పోలేక ఉండిపోయారని ,ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా వారసత్వ భూముల పంపిణీ, గెట్ టు పంచాయితీలు, తదితర భూ సమస్యలు లేకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించడం కోసం ఈ పోర్టల్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, ఏజెన్సీ చట్టాలకు లోబడి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు, ఈ రెవెన్యూ సదస్సులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, ఏడి సర్వే ల్యాండ్ ఏ.నరసింహమూర్తి, ఏడీఏ ఏ.శ్రీనివాస్ రావు, డిపిఓ హరిప్రసాద్, స్థానిక తహసిల్దార్లు బి.విజయ, శారద, ఎంపిడిఓలు విజయలక్ష్మి, మంగమ్మ, పిఏసీఎస్ చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి, దుర్గప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## దసరా పండుగకు గ్రామ పంచాయతీలకు వచ్చిన చీరలను పంపిణీ చేయాలి



ములుగు, ఏప్రిల్ 26, మనం ప్రతినిధిః దసరా పండుగకు రెండు రోజుల ముందు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయబడిన దసరా చీరలను నాటి నుంచి నేటి వరకు పంపిణీ చేయకుండా గ్రామపంచాయతీ కార్యాలయంలో భద్రపరచడం జరిగిందని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి దసరా చీరలను పంపిణీ చేయవలసిందిగా తెలంగాణ మాల మహానాడు ములుగు జిల్లా అధ్యక్షులు మరియు జిల్లా ఎస్సీ ఎస్టీ ట్రాసిటి విజిలెన్స్ అండ మానిటరింగ్ మాజీ జిల్లా సభ్యులు ₹రాజమల్ల సుకుమార్₹ జిల్లా కలెక్టర్ గారినీ కోరారు లక్షల రూపాయలు వెచ్చించి చీరలను కొనుగోలు చేసిన ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దసరా నుంచి నేటి వరకు ఎందుకు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదని తక్షణమే చీరలను పంపిణీ చేయాలని లేకపోతే లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన చీరలు పాడైపోయే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ గారి దక్షిణం స్పందించి దసరా చీరలు పంపిణీ చేయవలసిందిగా సుకుమార్ కోరారు.

# భూభారతి చట్టం ద్వారా రైతు భూసమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.



ఏటూర్ నాగారం, ఏప్రిల్ 26 మనంన్యూస్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025 ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. శనివారం ఐటిడిఏ, ఏటూరు నాగారం కార్యాలయం లో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉందని, తద్వారా ఎంతోమంది రైతుల సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు. చట్టంలో కీలకమైనది అప్పీలు వ్యవస్థ అని, ఎవరైనా రైతుకు అన్యాయం జరిగినట్లయితే ఆపిల్ వ్యవస్థ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. తహసిల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సి సి ఎల్ ఎ స్థాయిలలో అప్పిలు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాలలో చాలావరకు భూమి హద్దుల గొడవలు ఉంటాయని, కానీ భూభారతిలో రీ సర్వే, కొనుగోలు, పాలు పంపకాలు, దస్తావేజులు, విరాసట్ పట్టా మార్పిడికి తప్పనిసరిగా కమతం జతపరచడం వల్ల భవిష్యత్తులో భూ గొడవలు ఉండవని తెలిపారు. భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని, గతంలో గ్రామాలలో గ్రామ పరిపాలన, వి ఆర్ ఓ / వి.ఆర్.ఏ వ్యవస్థ ఉండేవని, వారిని ఇతర శాఖలలో సర్దుబాటు చేయడం వల్ల గ్రామాలలో భూ సమస్యలు పెరిగాయని, త్వరలో గ్రామ పాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ల నియామకంతో భూ సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. విరాసత్ మార్పిడికి వారసులకు అందరికీ నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఉందని, భవిష్యత్తులో ఎలాంటి గొడవలు ఉండవని తెలిపారు. ప్రతి రైతు భూభారతి చట్టంలోని అంశాల పట్ల అవగాహన చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగదీశ్వర్, మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోల్లులో ఆలస్యం కావద్దు

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..



జనగామ,ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): జనగామజిల్లా కేంద్రం లోని వడ్లకొండ, శామీర్ పేట్ లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు.ఈ పరిశీలన లో భాగంగా.. జిల్లా లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో... రైతులు ధాన్యం అమ్మగా...కొందరి రైతుల ఖాతా లో నగదు జమ అయ్యాయి.ఈ సందర్బంగా..జనగామ మండలం శామీర్ పేట కి చెందిన నర్సింగ్ రావు అనే రైతుకు కలెక్టర్ స్వయం గా ఫోన్ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో... ధాన్యం అమ్మినందుకు .. ఆ డబ్బులు అతి త్వరగా తన ఖాతా లో జమ అయినందుకు ..రైతు స్పందన ను అడిగి తెలుసుకున్నారు ఎప్పుడు ఈ సెంటర్ కి ధాన్యం తీసుకొచ్చారు .. ఎప్పుడు అమ్మారు అని.. నగదు ఎప్పుడు మీ ఖాతా లోకి జమ అయ్యాయి అని రైతు మాటల్లో కలెక్టర్ తెలుసుకున్నారు.ఇందుకు ఆ రైతు స్పందించి..ఈ నెల 10 వ తేదిన శామీర్ పేట్ లోని ఐకేపీ సెంటర్ కి 30 కింటాళ్ల 80కిలోల ధాన్యం తెచ్చి .. 12 వ తేదీన తాలు పట్టానని .. 13 వ తేదీ న మొత్తం 77 బస్తా లకు కాంట అయ్యాయని తెలిపారు. 18 వ తేదీన తన ఖాతా లోకి 71 వేల రూపాయలు నగదు జమ అయ్యాయని.. ఇంత తొందరగా డబ్బులు పడినందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో నే రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని బయట దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంప్ క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయండి

- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే...
- స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనుల పరిశీలన....

వరంగల్, ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణ లో భాగం గా క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని ఇండోర్ స్టేడియం తో పాటు స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను కమిషనర్ క్షేత్ర స్థాయి లో పర్యటించి సమర్థవంతం గా నిర్వహించడానికి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ మే 1 నుండి ప్రారంభమయ్యే సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను సమర్థవంతం గా నిర్వహించాలని క్రీడాకారుల కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని 6 వివిధ రకాల క్రీడాంశాల్లో సుమారు నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్న నేపథ్యం లో అందుకు అవసరమైన క్రీడా సామాగ్రి తో పాటు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం ఇదే ఆవరణలో నూతనం గా నిర్మిస్తున్న స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించి పనుల్ని యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి సాధ్యమైనంత తొందరగా అందుబాటులోకి తేవాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమం లో ఈ ఈ లు రవి కుమార్ మాధవి లత డి ఈ లు కార్తీక్ రెడ్డి రాజ్ కుమార్ ఏ ఈ లు రాగి శ్రీకాంత్ నరేష్ స్టేడియం సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు.



## ఛాంబర్‌లలో వసతులను పునరుద్ధరించండి

**బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే**



వరంగల్,ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): ప్రధాన కార్యాలయం లోని వివిధ విభాగాల ఛాంబర్ లలో దెబ్బతిన వివిధ వసతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయం లోని పాత భవనం లోగల వివిధ విభాగాల ఛాంబర్ లను కమిషనర్ శనివారం క్షేత్ర స్తాయి లో పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్ల పై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో దెబ్బతిన్న ఫ్లోరింగ్ మరుగుదొడ్లు నీటి సరఫరా ను పునరుద్ధరించడం దెబ్బతిన్న కుర్చీలు టేబుల్స్ స్థానం లో కొత్తవాటిని సమకూర్చడం ఎలక్ట్రికల్ సంబంద సమస్యల ను పరిష్కరించడం అవసరమున్న ప్రాంతాల్లో కంప్యూటర్ ల ఏర్పాటు తదితర సమస్యలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఈ ఈ రవికుమార్ డి ఈ లు రాజ్ కుమార్ కార్తీక్ రెడ్డి జేఏఓ లు సరిత జగదీశ్వరి సూపరిండెంట్ రావుల ఆనంద్ ఏఈ లు రాగి శ్రీకాంత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం లో రెండో దఫా లబ్ధి దారుల గుర్తించే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సత్యా శారద



వరంగల్ ,ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రెండో దఫా గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.శనివారం వరంగల్ నగరం, బల్దియా పరిధి 18 డివిజన్ క్రిస్టియన్ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే తీరును క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. రెండో దఫా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హులేనా కదా అన్న విషయాన్ని భౌతికంగా పరిశీలించి, డేటా ఆధారం గా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు సమర్థంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతో జరగాలన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతి, కార్పొరేటర్ వస్కుల బాబు, ప్రత్యేక అధికారి రమేష్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం ఉపయోగపడుతుంది

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ఏప్రిల్ 26 (మనం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం, బొర్ల గూడెం రైతు వేదికలో శనివారం నిర్వహించిన భూ భారతి నూతన రెవెన్యూ చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా నిర్వహించారు.ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు భూ భారతి చట్టం ద్వారా రికార్డుల నిర్వహణ ఒక్కగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డు లాగా భూమి కలిగిన ప్రతి రైతుకు భూధార్ కార్డు జారీ చేయనున్నారని తెలిపారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ చేసేందుకు అవకాశం లేదని సివిల్ కోర్టు కు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, కానీ భూ భారతి చట్టంలో రెండెంచల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు. ప్రతి అంశం భూ భారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. భూమి హక్కుల రికార్డు నిర్వహణతో ఎవరు భూమికి యజమానో స్పష్టత ఉంటుందని వివరించారు. భూమి హక్కుల రికార్డులు భూ భారతి పోర్టల్ లో అందుబాటులో ఉంటాయని, ఎవరైనా భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ కావాలంటే భూ భారతిలో ఉన్న ఫారంలో పది రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేయాలని, తహసీల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీచేస్తారని తెలిపారు. భూ రికార్డుల నిర్వహణ ఉండటం వల్ల భూ లెక్కలు పక్కాగా అమలు చేయబడతాయని సూచించారు. రైతులు అడిగిన సందేహాలు, సమస్యలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల ప్రత్యేక అధికారి వేముకటేశ్వర్లు, తహసీల్దార్ అనిల్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఇంప్లిమెంట్ కాకుంటే అమర నిరాహార దీక్ష చేస్తా

- డా జాడి రామరాజు నేత

ములుగు, ఏప్రిల్ 26, మనం ప్రతినిధి:శనివారం రోజున ములుగు జిల్లా కలెక్టర్ ను కలిసి ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ప్రకటన చేసి



2సంత్సరాలు పూర్తి అయినప్పటికీ ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఇంప్లిమెంట్ కాకా పోవడం వలన బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత ములుగు కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తూనే మాట్లాడుతూ మైదాన ప్రాంతనాయకురాలు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఏజెన్సీప్రాంత దళిత బహుజన వర్గాల ప్రజల ఓట్లు కావాలి కాని అభివృద్ధి మైదానప్రాంతకావాలా అన్నారు అసెంబ్లీ ఎన్నికల ముందు రెవిన్యూ డివిజన్ కోసం ఉత్తరం ఇచ్చినట్లు చేసింది అసెంబ్లీ ఎన్నికలు అయ్యాక తెలంగాణ మంత్రి అయ్యాక ఇచ్చిన రెవిన్యూ డివిజన్ గురించి అసెంబ్లీ లో మాట్లాడి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ దళిత బహుజనమైనార్టీ వర్గాల అమాయకత్వం ను ఆసరా చేసుకొని రెవిన్యూ డివిజన్ ఇంప్లిమెంట్ అయినట్టు పాలాభిషేకం చేపించుకున్నా మంత్రి రెవిన్యూ డివిజన్ ఇంప్లిమెంట్ ఎందుకు చెయ్యడం లేదో చెప్పాలని అన్నారు అదేవిదంగా ఇప్పటికైనా ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలు మైదానప్రాంత నాయకురాలు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి మాటలు నమ్మి మరోసారి మోసపోకూడధాని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు అదేవిదంగా రెవిన్యూ డివిజన్ ఇంప్లిమెంట్ అమర నిరాహార దీక్ష చెయ్యడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు ఈ కార్యక్రమం లో బీజేపీ కన్నాయిగూడెం ఉపాధ్యక్షులు కుమ్మరి సత్యం మండల ప్రధాన కార్యదర్శి జనగాం ఆనంద్ బీజేపీ నాయకులు సునారకాని సమ్మయ్య కొండగొర్ల నార్సింగారావు పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ



ములుగు,ఏప్రిల్ 26,మనం ప్రతినిధిః శనివారం రోజు ములుగు జిల్లా కేంద్రంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు కోర్టు డ్యూటీ మరియు కోర్ట్ లైజనింగ్ అధికారులతో ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్.పి ఐపిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, న్యాయ సంబంధిత విధుల్లో నిర్లక్ష్యం అంగీకరించదగినది కాదని, ప్రతి కేసు విచారణలో చార్జీట్లను నిర్దేశిత కాల వ్యవధిలో న్యాయస్థానాలకు సమర్పించాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు.అలాగే కోర్టు విచారణకు సంబంధించి సాక్షుల హాజరును నిర్ధారించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా స్పష్టం చేశారు. ప్రతి కేసులో సాక్షులకు విధిగా సమన్లు అందచేసి కోర్టు కి హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయాన్ని మెరుగుపరచి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి తన విధులను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.వారంట్లను అమలు చేసి అనుమానితులను/నేరస్థులను కోర్టుకు హాజరు పరచే సమయంలో వారిని సురక్షితంగా, సమయానికి న్యాయస్థానాలకు తరలించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కోర్టు డ్యూటీలలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠినంగా వ్యవహరించబడుతుందని హెచ్చరించారు. కోర్టు డ్యూటీల నిర్వహణలో పటిష్టత తీసుకురావాలని, బాధితులకు న్యాయం జరిగేలాగా చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఇఖఆ డిఎస్పీ కిషోర్ కుమార్,డి సి ఆర్ బి ఎస్సు లు జగదీష్, ఐ టి సెల్ సిబ్బంది రాజేంద్రప్రసాద్, సంధ్య , కోర్టుల లైసన్ అధికారులు మరియు కోర్టు డ్యూటీ అధికారులు మరియు ట్రైన్ ఎస్ఐ లు పాల్గొన్నారు.






# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు: సురేశ్ రైనా

ఐపీఎల్ 2025 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్ కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.

''కాశీ సర్ కు అడ్మినిస్ట్రేషన్ కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్ కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్ ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్లోని సభ్యులే ఆక్షన్లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్క్యాప్డ్ ప్లేయర్గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం'' అని రైనా వ్యాఖ్యానించాడు.

**ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్**

''ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది'' అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

**ఇక ట్రయల్ రన్లా..: రాయుడు**

''ప్రస్తుత సీజన్లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్రన్లా సీఎస్కే జట్టును చూడొచ్చు'' అని అంబటిరాయుడు వ్యాఖ్యానించాడు.




# పాక్ తో క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ



2008 తర్వాత పాకిస్థాన్ కు టీమ్ఇండియా వెళ్లని సంగతి తెలిసిందే. చివరిసారిగా 2012 - 13లో భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అప్పట్నుంచి కేవలం తటస్థ వేదికల్లోనే తలపడుతూ వస్తున్నాయి. ఇప్పుడు పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ తో క్రికెట్ ఆడొద్దనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలకు భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ మద్దతు తెలిపాడు. ఇక నుంచి పాక్ తో ఎలాంటి క్రికెట్ ఆడొద్దని బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు. ''వందశాతం అంగీకరిస్తా. పాకిస్థాన్ తో క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలి. అది జరిగి తీరాలి. తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉండటం తమాషా కాదు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదు'' అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

**ఉగ్రదాడి పై స్పందించని పాక్ క్రికెటర్లు**

కశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిపై ప్రపంచవ్యాప్తంగా స్పందనలు వస్తుంటే.. డానిష్ కనేరియా మినహా పాకిస్థాన్ క్రికెటర్లు ఎవరూ స్పందించలేదు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా మాత్రం భారత్ పై అవాకులు చవాకులు పేలిన సంగతి తెలిసిందే. టోర్నీనే బహిష్కరించాలంటూ పెద్ద మాటలే చెప్పారు. ఇప్పుడు మాత్రం కనీసం ఖండిస్తూ ఒక్క ప్రకటన చేయలేదు. ఆ దేశ ప్రభుత్వంలా 'తమకేమీ సంబంధం' లేనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

గతేడాది ఆర్సీబీ చేసింది..

# ఆ స్ఫూర్తితో ఈసారి మేం సాధిస్తాం: నితీశ్

ఐపీఎల్ 2025 సీజన్ లో చెపాక్ వేదికగా తొలిసారి సన్ రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్ను ఐదు వికెట్ల తేడాతో మట్టికరిపించింది. దీంతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తొమ్మిది మ్యాచుల్లో మూడు విజయాలనే నమోదు చేసిన సన్ రైజర్స్.. మిగతా ఐదు మ్యాచుల్లో అన్నీ గెలిస్తేనే నాకౌట్ కు చేరుతుంది. ఈ విషయంలో తమకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టే స్ఫూర్తి అని ఎస్ఆర్హెచ్ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించాడు. ''చెన్నైపై విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఇకనుంచి మేం ఒక్కో మ్యాచ్ ఫలితం గురించి ఆలోచిస్తాం. ఇప్పుడు గెలిచాం. మిగిలిన వాటిల్లోనూ విజయం సాధించేందుకు ప్రయత్నిస్తాం. కమిందుతో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించడం బాగుంది. భారీ షాట్లకు పోకుండా తేలికగా మ్యాచ్ ను ముగించాలని మాట్లాడుకున్నాం. నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బౌలింగ్ బాగా చేస్తున్నారు. చివరికి మేం విజయం సాధించాం. మాకు డూ ఆర్ డై లాంటి పోరు. గతేడాది ఇదే పరిస్థితుల్లో ఆర్సీబీ ఉంది. వరుసగా మ్యాచులు గెలిచి ప్లే ఆఫ్స్ కు చేరుకుంది. ఈ సంవత్సరం మేం ఎందుకు సాధించకూడదు? వందశాతం ప్రదర్శన ఇస్తే మిగతా మ్యాచుల్లో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి'' అని నితీశ్ వెల్లడించాడు.



# మహేష్ కంటే రాజమౌళి డబుల్..?

ప్రస్తుతం టాలీవుడ్ లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి డైరెక్షన్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తున్న ఖిఖిఆ29 కూడా ఒకటి. ఈ సినిమాను రాజమౌళి నెక్స్ట్ లెవెల్ లో చిత్రీకరిస్తున్నాడు. ఇక ఇప్పటికే ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి హైప్ క్రియేట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా కోసం నిర్మాత ఏకంగా రూ.1000 కోట్ల బడ్జెట్ ను కేటాయించారట. అయితే, ఈ సినిమా కోసం రాజమౌళి తీసుకునే రెమ్యునరేషన్ ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది. ఈ సినిమా కోసం ఆయన ఏకంగా రూ.200 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడని.. ఇది మహేష్ బాబు రెమ్యూనరేషన్ కంటే రెట్టింపు అని తెలుస్తోంది. ఇక ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ను ఆఫ్రికాలో షూటింగ్ చేయనున్నారు మేకర్స్. ఈ సినిమాలో మహేష్ బాబు చేసే అడ్వెంచర్ ప్రేక్షకులను కట్టిపడేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.




# శర్వానంద్ సినిమాలో అనుపమ ఎంట్రీ

ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇక ఆయన కెరీర్లో 38వ చిత్రాన్ని దర్శకుడు సంపత్ నంది డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమాపై సినీ సర్కిల్స్తో పాటు ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. అయితే, ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్ టైనర్ గా మేకర్స్ రూపొందిస్తున్నారు.

ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ రివీల్ చేశారు. ఈ




సినిమాలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్నట్లు వారు అనౌన్స్ చేశారు. ఆమెకు సంబంధించి ఓ ప్రీ-లుక్ పోస్టర్ కూడా వారు రిలీజ్ చేశారు. దీంతో ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి అందరిలో నెలకొంది.

ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత కె.కె.రాధామోహన్ శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్ పై ప్రొడ్యూస్ చేస్తున్నారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.